REGISTERED NO. M. 1287. చందాపోస్టేజీతో రు 3-4-0.

పశ్చిమవర్షము.] మార్చి 1918. [సంచిక 9.

# ఆంధ్రకేసరి

పిఠాపురము, గోదావరిజిల్లా.

రిజస్టరునంబరు ఎమ్. 1287.

శ్రీ

# ఆంధ్ర సేవ.

యను

విద్యావిషయప్రధానమగు

మాస పత్రిక.

ప్రతిమాసాదిని వెలువడును.

---

శ్రీలనొసంగు సత్కళల శేషము నాంధ్రమునందుఁ జెల్వఁగాఁ
జాలినయట్టి ప్రౌఢ లనిశంబు శ్రమింపడి జాణఁజేయఁ దాఁ
దేలిన పత్త్రికాంగన యిదే చనుదెంచెడు నిష్ఠ ధాత్రిపై
శీలముగల్గు నాంధ్రులకు సేవయొనర్పఁగ నాంధ్రసేవనాన్.

---

ఇది

శ్రీ రాజా రావు వేంకట కుమార మహీపతి
సూర్యరాట్ప్రభువరేణ్యుని రాజధానియగు
శ్రీమత్పీఠికాపురమున

నున్న

అద్దంకి మాధవశాస్త్రిగారి యాధిపత్యమున
శ్రీవిద్వజ్జనమనోరంజనీముద్రాక్షరశాలయందు
ముద్రింపఁబడి ప్రకటింపఁబడును.

1918.

కాపీరైటు.

సంవత్సరమునకుఁ జందా రు 3-0-0 లు.
మూఁడురూపాయలు మాత్రము.

# విషయసూచిక.

1. కాళీఘట్టము.
(Calcutta)

2. స్వప్నకావ్యము—మ. రా. రా. శ్రీ పానుగంటి లక్ష్మీనరసింహ రావుపంతులుగారు, పిఠాపురము.

3. పులీబూరుశాసనములు—మ. రా. రా. శ్రీ పెండ్యాల వేంకట సుబ్రహ్మణ్యశాస్త్రిగారు, పిఠాపురము.

4. అమలవర్మ (A translation to Hamlet) — మ.రా.రా.శ్రీ నందూరి మూర్తిరాజుగారు, బి. ఏ.

5. విజనసదనము (A Novel) — మ.రా.రా.శ్రీ కవుకొండల వెంకటారావుగారు, బి. ఏ. బి. ఎల్, రాజమండ్రి.

మొగలు రాజప్రతినిధివద్దనుండి చార్నాకునకు వచ్చిన ఫర్వానా యీ విధముగనుండెను. "రాజసైన్యముతోను నాతోను మీరక్రమముగాఁ బోరాడి మూఁడువేల ఫిరంగులను బేల్చి 'మూరు, (Moors) లయొక్క యోడలను దోచుకొని, పవిత్రమైన మహమ్మదీయులను బాధపెట్టినటుల నౌరంగజేబు పాదుషావారికిఁ దెలిసిన యెడల మీతప్పును మన్నించు ననుకొందురా? అటులయ్యు వయోవృద్ధుఁడును, కరుణాంతరంగుఁడునగు రాజప్రతినిధి మిమ్ములను శిక్షింప నిచ్ఛగించుట లేదు." ఈవిధముగఁ బ్రారంభింపఁబడిన వ్రాతనే సమానాధికారులుగావించుకొను సంధిపత్రములను గౌరవనామములతో నాంగ్లేయులు తెలుపుకొనఁజొచ్చిరి. ఆరాజప్రతినిధి యుత్తర ప్రకారము చార్నాకును దానున్నచోట స్థిరముగా నుండుటయో లేక హుగ్లీపట్టణమున మఱల నివాసమేర్పఱచుకొనుటయో కావించునటుల ననుజ్ఞనిచ్చెను. హుగ్లీయందు మొగలాయియధికారుల సమీపమునఁ బులినోట నున్నటులుండుటయు, ఉలుబేరియా యందు భూమిమీఁదనుండి వచ్చువర్తకమునకు దూరమైయుండుటయు గూడ నాతనికి శ్రేష్ఠముగఁ దోఁచలేదు. అందుచే క్రీ. శ. 1687 వ వత్సరము సెప్టెంబరు నెలలో మెల్లగా నదియెగువకుఁ గాళీఘట్టమున్న చోటునకు వెడలి రెండవమారు మఱల నాప్రదేశము నాక్రమించెను.

మొగలు రాజప్రతినిధి వీరిని దగినట్లు శిక్షించితిమని యనుకొని పవిత్రమైన మహమ్మదీయుఁడగుటచేఁ దమ మతానుసారము వయోవృద్ధులు కాలము సమీపించునపుడు గావించుకొను వ్రతములయందు మగ్నుఁడై యొక వత్సరమువఱకు వీరిమాటఁ దలంపలేదు. ఈవత్సరములో 'చార్నాకు' మొదటఁ గొన్ని కుటీరములను నిర్మించి యందుఁ దన పరివారము నంతయు నుండనియమించి యొక వర్తకస్థానమును గట్టుటకుఁ గూడ ననుజ్ఞకై వేచుచు నాయనుజ్ఞవచ్చుటకుఁ బూర్వమే

పనినిబూర్తిగావించుచుండెను.

ఇటులుండ నాంగ్లేయదేశములోనుండి వర్తకులు 'చార్నాకు' ముప్పదినాల్గువత్సరములనుండి హిందూదేశమున శ్రమపడుచు వారి వర్తకము వృద్ధియగుటకుఁ దన జీవితమునంతను ధారవోయుచున్నాఁ డనియైనఁ దలఁపక యాతఁడును వంగదేశములోని యితరసేవకులును మొగలాయిసైన్యమునకు లొంగి వారు చెప్పినచొప్పున నడచుకొను టచూడ మిగుల నాశ్చర్యముగనున్నదనియు 'హిజిలీ' యందలి ధైర్యమైన రక్షణమైనను భగవత్కృపవలనఁ గలిగినదికాని వారి సేవకుల బుద్ధిచాతుర్యమువలనఁ గలిగినదికాదనియు నిందాపూర్వకముగ వ్రాయుచు నారుపదాతులపటాలములతో మొగలురాజ్యమును జయించవలెనను తమయొక్క మహోద్దేశము 'చార్నాకు' యొక్క తెలివితక్కువవలన భగ్నమయ్యెననియుఁ దమసైన్యము బలముగలదియై యున్నప్పుడు తమ యాజ్ఞాప్రకారము చిటగాంగు(Chittagong) న కాతఁడు వెడలియుండినయెడల వారికిఁ దప్పక జయము చేకూరియుండుననియు మొదలయిన వింతయభిప్రాయములను గలిగియుండిరి.

హిందూదేశమునుగురించి వారి కట్టి యభిప్రాయము లుండుటచే క్రీ.శ. 1688 వ వత్సరరము సెప్టెంబరునెలలో నిందాపూర్వకముగు మఱొక యాజ్ఞాపత్రమును 'హీతీ' (Heathe) అను నాతనిచేఁ బంపిరి. తక్షణము 'చిటగాంగు'ను జయించుటకు వెడలవలయునని యందు స్పష్టముగాఁ దెలుపఁబడెను. నూతనముగ వృద్ధిలోనికి వచ్చుచున్న యావర్తకస్థానము పాడయిపోవునని యాతఁడు తలంచినయెడల సేవకులను గొందఱినిమాత్రి మచట నుంచి మిగ్గిలిన పరిజనమునంతయుఁ బంపవలయునని ఖచితముగా నందువివరింపఁబడెను.

కొందఱు సేవకులనైన నచట నుండనీయవచ్చునను నవకాశ

ము 'చార్నాకు'నకు దొరకుటవలన నాంగ్లేయులు మఱికొంతకాల మచట నుండవచ్చునను నాశ యాతనికి జనించెను. చార్నాకునకున్న దూరదృష్టి 'హీంతీ'నికి లేకపోవుటచే చలచిత్తమువలన ననేకపర్యాయములు తన యభిప్రాయములను మార్చుకొని తుదకు 'చార్నాకు'ను సేవకులను 'చిటగాంగు'నకుఁ బ్రయాణసన్నద్ధులు కావలయునని యాజ్ఞాపించి కొలఁది పరిజనమునుమాత్ర మచట విడిచిపెట్టెను. వారట్లు పోగానే మొగలురాజప్రతినిధి మిగిలినవారి నందఱను గారాబద్ధులను గావించెను.

వీరిస్థితి యిటులుండగా 'చిటగాంగు'నకు వెడలిన సైన్య మచటఁ బదివేలసైన్యముతో నాస్థలము రక్షింపఁబడుట చూచి సంధిప్రయత్నములకుఁ గడంగి యొక మాసము వ్యర్థముగఁ గాలమునుబుచ్చి సైన్య మింతకాలమునుండియుఁ గడుపునిండ నాహారములేక కృశించుటచూచి తుద కొక రాయబారిని వారికడ విడిచిపెట్టి చెన్నపట్టనమునకు వెడలి యచటఁ గొంతకాలము సురక్షితముగ నుండునటుల నన్నియోడలకును నాజ్ఞయీయఁబడెను. క్రీ. శ. 1689 వ వత్సరము ఫిబ్రవరి 17 వ తేదిని వారు బయలుదేరి చెన్నపట్టనమునకు వెడలి యచటఁ బదునేనుమాసము లుండిరి.

ఈపదునేనుమాసములలో హిందూదేశమంతలోను కంపెనీసైనికులకును మొగలుసైనికులకును పోరాటము జరుగుచునే యుండెను. ఆంగ్లేయులు భూమిమీఁద బోరాడుటకశక్తులై మొగలుసైన్యముముందు నిలువలేక హిందూదేశములోని తమవర్తకస్థానములలో నన్నిటినుండియుఁ దరుమఁబడినను సముద్రముమీఁద నెక్కువశక్తిగలవారగుటచే మక్కాకు వెడలు మొగలుల యోడలకన్నిటికి మిక్కిలిబాధను గలుగఁజేయుచుండిరి. అంతియేకాక హిందూదేశముతో నదివరకు జరు

గుచున్న వర్తకమునంతయు నాపివేసిరి. తమ పుణ్యస్థలమునకు వెడలు యాత్రికులకుఁ బ్రతిబంధముగలుగుటయుఁ దమ దేశములోని వర్తక మాగిపోయి ధనరూపముగ నష్టము గలుగుటయుఁ జక్రివర్తికి సంధిని జేసికొనునట్లు పురికొలిపెను. ఈవల నాంగ్లేయు లొంటరిగఁ బోరాడలేక పెరించివారిని డచ్చివారిని సహాయ మడుగగా వారు మనస్ఫూర్తిగ సాయముఁ జేయకపోవుటచే వ్యర్థప్రయత్నమని యాలోచించి యాంగ్లేయులుకూడ సంధికిఁ బ్రయత్నించుచుండిరి.

క్రీ. శ. 1690 ఫిబ్రవరి 27 వ తేదీ గలిగిన యౌరంగజేబుపాదుషాయొక్క ఫర్మానా రెండు కక్షలయొక్క సంధికి నిదర్శనముగనున్నది. తామొనర్చిన నేరములన్నిఁటిని బాదుషావారు క్షమించవలయుననియు ముందెన్నఁడు నట్లు లజ్జాకరముగఁ బ్రవర్తించమనియు నాంగ్లేయులు ప్రార్థించినారు గనుక లక్షయేబదివేల రూప్యములను జరిమానాగా వారు చెల్లించి వారిదౌర్జన్యములకన్నిఁటికిని గారకుడైన వారినాయకుని వారిదేశమునకుఁ బంపినయెడల నూతనముగ నొక లైసెన్సు (Licens )వర్తకము చేసికొనుట కిచ్చెదమని యందుఁ దెలుపఁబడెను.

ఈవిధముగ హిందూదేశమునకంతకు నీయఁబడిన యధికారపత్రముయొక్క నకలు వంగదేశములోని మొగలు రాజప్రతినిధికిఁగూడఁ బంపగా నాతఁడు చెన్నపట్టనములో దాగియున్న కంపెనీవర్తకులు తిరిగి రావచ్చునను నాజ్ఞాపత్రమును వారికిఁబంపెను. అదివఱకుఁ దాము చెల్లించుచున్న ప్రకారము సంవత్సరమునకుఁ దమ భాగమునకు మూఁడువేల రూప్యముల నిచ్చెదమని స్పష్టముగా వంగదేశమునకుఁ జెందిన వరతులతో వారు తెలుప మర్యాదస్థుడైన యామొగలాయియధికారి యొప్పుకొని వారు వచ్చుటకనుజ్ఞనిచ్చెను. అంతేకాక

యదివఱకుఁ గోరాబద్ధులను గావించినవారల నందఱను విడిచిపెట్టెను.

క్రీ. శ. 1690 వ వత్సర మాగస్టు 24 వ తేదిని మూఁడవపర్యాయము కాళీఘట్టపు రేవులో నాంగ్లేయవర్తకులు ముప్పదుగురు రక్షకభటులు తమ్ముఁ గక్షించుచుండ మెల్లగా హుగ్లీనదిలోనుండి వచ్చి యురద తీరమును దాటి యాస్థలమును నివాసముగఁ జేసికొనిరి. నాటి నుండియు మధ్య నేవిధమైన యంతరాయములును లేక క్రమక్రమముగ నదివృద్ధిలోనికివచ్చెను.

'చార్నాకు'ను, అతనియనుచరులును మూఁడవపర్యాయము కాళీఘట్టపుమడుగున క్రీ. శ. 1690 వ వత్సర మాగస్టునెలయిరువదినాల్గవతేదిని బ్రవేశించునప్పటి కాస్థల మహోరాత్రములు వర్షము గురియుచుఁ దాత్కాలికముగ వారునిలుచుటకైన వీలులేకుండెను. నదియొడ్డున నాతనియనుచరులందఱను విడియునట్లు చేయుటచేతను, నదీప్రాంతము మిక్కిలిచలిగలిగి రోగభూయిష్ఠమైన ప్రదేశమగుటచేతను వారందఱును 'చార్నాకు'పైనఁ దిరుగఁబాటుగావింప సన్నద్ధులైరి.

అప్పుడు 'చార్నాకు' స్వలాభమును జూచుకొనినయెడల హుగ్లీపట్టనమువఱకు నదికిఁ బైనఁబోయి యుండును. ఏలయన నచట నివసించుచున్న మొగలురాజప్రతినిధి నూతనముగావచ్చినవాఁడగుటచే వీరికనుకూలుఁడై పూర్వము వీరిచ్చుచుండినటుల మూఁడువేలరూప్యములను సంవత్సరమునకుఁ బన్నుఁగట్టుచుండినయెడల నేవిధమైన రేవుపన్నులును వీరియొక్కర లేకుండునట్లుత్తరువు నిచ్చెదనని తెలిపి వీరితో సఖ్యముగనుండెను. ఆరాజప్రతినిధియొక్క రక్షణము నపేక్షించినయెడలఁ దమయోడలనుండి దూరముగ నుండవలసివచ్చుననుభయముచే 'చార్నాకు' నదియెగువకు వెడలుటకు సంశయించెను. మొగలురాజ్యమునుండి సంపాదించిన 'ఫర్మానాల'కంటెఁ దమయోడలయొక్క రక్ష

గానే తమసరకులకు ముఖ్యమైనదని యాతఁడు పూర్తిగ నమ్మెను. అందుచేతఁ దా ననారోగ్యమువలన మడిసినను శాశ్వతముగఁ గంపెనీవర్తకమును వృద్ధిచేయుటకాతఁడు సంకల్పించుకొనెను గావున నా స్థలమునందే యాఁగి కాళీఘట్టమునం దాంగ్లేయులవర్తకస్థానమును నిర్మింప సమకట్టెను.

ఇదివఱకు క్రీ.శ. 1638 వ వత్సరమునఁ దాముకట్టినయిండ్లన్నియుఁ బరశురామప్రీతికావింపఁబడుటచే మూఁడుచిన్నయిండ్లయొక్క గోడలుమాత్రము నిలిచియుండెను. అందుచే వారావత్సరమునందలి (1690) శీతకాలమంతయు నదియందలినావలమీఁదనే కాలమునుగడపి కాపునిలుచుటకు వీలయినంతస్థలమును బాగుచేసికొని మరుచటివత్సరమున వేసవిప్రవేశించునప్పటికింకను డేరాలలోను కుటీరములలోను, పడవలలోను, వారునివసించుచునే యుండిరి. ఇట్లు శ్రమలఁబడుచుండుటచే నావత్సరముననాతఁడు వర్తకమువిషయమై యెక్కువశ్రద్ధఁ దీసికొనుటకు వీలులేక కొలఁదిసరకులనుమాత్రమే మాతృదేశమునకుఁ బంపెనట. అందుపై నధికారులకాగ్రహము జనించి యాతనిని మందలించిరఁట.

ఎట్లయినను గాళీఘట్టము క్రమక్రమముగా వృద్ధినొందినది. అచట లోతైనమడుగుండుటచే నదికెగువగనున్న ఫ్రెంచివారియొక్కయు డచ్చివారియొక్కయు వర్తకస్థానములనుండి సరకులన్నియు నచటికే దేఁబడుచుండెడివి. తమప్రాణధనములకు రక్షణమునిమిత్తమై దేశీయవర్తకులందఱు నిచటికే, చెన్నపట్టనమునకువచ్చినటులే వచ్చి కాపురముండిరి. కాని యాస్థలమునకు నంటియున్నబురదనేలలవలన నది మిక్కిలి యనారోగ్యకరమైనదగుటచే ననేకులు రోగములవలనఁ బ్రాణములఁ గోలుపోవుచుండిరి. అందుచే నాంగ్లేయనావికులందఱును

వానిని 'కల్కత్తా'(Calcutta) కు బదులు 'గొల్గొథా'(Golgotha) యని పిలుచుచుండిరి. అనగా 'కపాలములుండుస్థానమ'ని యర్థము.

అయినప్పటికిని గాళీఘట్టము పదివత్సరములు గడచునప్పటికిఁ పండ్రెండువందలయాంగ్లేయులకు నివాసముగ నుండుటయేకాక మిక్కిలి యర్థముకలిగిన వర్తకస్థానముగ నుండెను. ఆవత్సరమున(క్రీ. శ. 1700)కంపెనీవారు సూతనాతి, కాళీఘట్టము, గోవిందపురము ననుమూఁడు గ్రామములను, ఔరంగజీబుపాదుషావారికుమారుఁడైన 'అజీము, శాకుమారునియొద్దనుండి కొనిరి.

ఈపదివత్సరములలోఁ గంపెనీవ్యాపారములలోను, ఉద్దేశములోను గొన్నిమార్పులు గలిగెను. ఆమార్పులను సూక్ష్మముగఁ దెలిసికొనినఁగాని కాళీఘట్టముయొక్క పురోవృద్ధిని గ్రహించుట కష్టము.

వంగదేశములోని కంపెనీసేవకులు (క్రీ శ. 1689-90 వత్సరమున నాప్రాంతములలోనున్న తమవర్తకస్థానములన్నిఁటికిని ముఖ్యమైనదానిగఁ జేయవలయునని స్థిరపఱచుకొనిరి. ఈసమయముననే యాంగ్లేయదేశములోని డైరక్టరులు పంపినయొకసందేశమునందుఁ దాము బుద్ధిపూర్వకముగా నీస్థలమును గ్రహింపఁదలఁచుకొనలేదనియు నట్లయ్యుఁ గార్యము మించిపోయినదిగనుక వెనుకకు వెడలుట భావ్యముకాకపోవుటచే నెన్నికష్టములువచ్చినను దమకుఁ బ్రస్తుతకర్తవ్యము దానిని నిలువఁబెట్టుకొనుటయేయనియు నట్లు దానిని నిలువఁబెట్టుకొనుటకు సైన్యమును బలమైనకోటలు నుండవలయునుగాని రాయబారులుఁ ఫర్మానాలును బనికిరావనియుస్థిరపఱచుకొనినట్లుండెను.

డైరక్టరులు హిందూదేశములోఁ దమవర్తకమును నిరాటంకముగా జరిగించుకొననేరకపోవుటకుఁ దోడాంగ్లేయదేశమునఁగూడ వారికిఁ గొన్నిచిక్కులు కలిగెను. ఆచిక్కులకు ముఖ్యకారణము వీరి

యొక్క యమితలాభమును జూచి తాముగూడ నాలాభమును బొందవలెనను నాశతో ననూయాగ్రస్తులు తమంతటఁదామే వర్తకమును జేసికొనుచు నప్పుడప్పుడు కంపెనీవర్తకపుటోడలను దోచుకొనుట మొదలయిన ఘాతలను జరిగించుటయే. కంపెనీయొక్క లాభమునకుఁ దార్కాణముగ నీక్రిందవివరింపఁబోవునంశములను దెలుపవచ్చును.

డైరక్టరులు క్రీ.శ. 1658 వ వత్సరమున 369891 పౌనులు వాటాలువేసికొని మూలధనము నేర్పాటుచేసికొనిరి. ఈమూలధనముయొక్క నూరుపౌనులవాటా క్రీ. శ. 1681వ వత్సరమున 280 పౌనులకమ్మెను. మరుచటివత్సరము జనవరినెలలోఁ బ్రతిభాగస్థునకును నూటికేబదిచొప్పున 'బోనసు' (Boness) నిచ్చుటయేకాక యాతనికాతాను నూరుపౌనులను జమకట్టిరి. అనగా మొదటనిరువదినాల్గువత్సరములక్రిందటఁ దాము వాటానిమిత్తమిచ్చినసొమ్మునకుఁ బ్రతివత్సరము కొంత'బోనసు'ను దీసికొనుటయేకాక యొకేసంవత్సరమున నూటికిఁ నూటయేబదివంతున లాభమునుదీసికొనిరి, ఇట్లుండుటచే నావత్సరమున (1682)డిశంబరునెలలో నూరుపౌనులవాటా మూఁడువందలపౌనులకును మరుచటివత్సర మయిదువందలపౌనులకును నమ్ముడువడెను. అనగాఁ దాము పెట్టుబడిపెట్టిన నూరుపౌనులకును క్రీ. శ. 1657 మొదలు క్రీ. శ. 1681 వ వత్సరమువరకునుండు నిరువదినాల్గువత్సరములలో డైరక్టరులు మొత్తముమీఁద 840½ పౌనులను లాభముగాఁబుచ్చుకొనిరి. అనగా 'దామాషాయీ'ని నూటికి సంవతరమునకు ముప్పదియైదుచొప్పున లాభమువచ్చెను. ఇట్టిలాభము కొలఁదిమూలధనముమీఁదగాదు. ఒక్కవత్సరముననగా క్రీ.శ. 1675 వ వత్సరమున నైదులక్షలయెనుబదివేలపౌనుల మూల్యముగలిగినసరకులను వారు తీసికొనివచ్చి రెట్టింపు అనగా పదునొక్కలక్షయరువదివేలపౌనుల మూల్యముగల సరకులను హిందూదేశమునుండి తీసికొనిపోయిరి.

## సంపాదకునియుపోద్ఘాతము.

నామిత్రుఁ డొకదినమున నుదయముననే నాయింటికి వచ్చి "రాత్రి నాకుఁ జిత్రమగుస్వప్నము వచ్చినది. దానిని నీవు స్వప్నకావ్య మనునొకచిన్నగ్రంథము నేకాశ్వాసముగా వ్రాయవలయును. నేను నూతనముగ ఛందస్సు నేర్చుకొని యిప్పుడిప్పుడే గీతము లల్లుట కలవాటుపడుచున్నాను. గ్రంథరచనకు నాకింక సమర్థత తక్కువ. నాటకరచనయందు నీవుకొంత యలవాటు కలవాఁడ వగుటచే నుక్తిప్రత్యుక్తులసందర్భము నీవెఱుఁగుదు వని నిన్నిట్లు కోరితిని" అని చెప్పి స్వప్నము నామూలాగ్రముగా వెల్లడించెను.

నేనిట్లంటిని. "స్వప్నములో మనసు హేతుబద్ధమై యుండదు. స్వచ్ఛందముగ నుండును. నీస్వప్నములోఁ గొంతభాగము సహేతుకమై సహజమై సందర్భసమన్వితమై యున్నది. నాకచ్చటమాత్రము సందేహముగ నున్నది."

ఈమాటలు విని యాతఁ డిట్లనియెను. "కన్నెత్రాడు తెంపుకొని కాళ్లు గుదులుదీఱఁ బఱుఁగెత్తు నాఁదూడ, బొమ్మజెముడుకంపలవెంటఁ బొలములవెంటఁ బడుట యెంతసహజమో, రాజమార్గము వెంటఁ బాహాటముగా సూటిగాఁ బోవుటకూడ నంతసహజమే యగును. కావున నీవు సందేహింపవలదు.

అప్పు డాతనిమాటల కీయకొని యిటులంటిని. "నీవు నాతోఁ జెప్పినమాటలనే వ్రాసెదను. గ్రంథమున నాసొంత మేమియుఁ జేర్పను. నీవు నాయొద్దఁ గూరుచుండుము. ఇప్పుడే వ్రాసెదను."

అట్లీగ్రంథమును వ్రాసితిని. స్వప్నసంపాదకుఁడు నామిత్రుఁ

డు స్వప్నకావ్యసంపాదకుఁడను నేను. దీనిలోనియభిప్రాయములమంచిచెడ్డల కాతఁడే బాధ్యుఁడు. పాపము! ఆతఁడుమాత్ర మెట్లు బాధ్యుఁడు? స్వప్న మాతని కట్లువచ్చినది.

భారతకవులలో నిద్దఱీస్వప్నకావ్యమునఁ బాత్రములుగా వత్తురు. వారిమాటలవలన, వారినడువడులు పాఠకులు సులభముగా గ్రహింపఁగలరు. కాని వారెట్టినడత కలవారో మన మెఱుఁగము. స్వప్నసంపాదకుఁడుమాత్ర మాకవు లట్టినడువడికలవారని తలఁచినట్లు మనమెంచుటకుమాత్రము కొంత యవకాశ మున్నది. అదిసత్యమో యసత్యమో యెవరు చెప్పఁగలరు? స్వప్నముమట్టునకుమాత్రము సత్యము. వ్యవహారమందైనను సత్యమనకలీఱనియీజగత్తు స్వప్నమని మహాజ్ఞాను లుపదేశించుచుండఁగా, మహాజ్ఞానినైననేను స్వప్నము సత్యమని చెప్పవలసివచ్చినందులకుఁ బాఠకులు నన్ను క్షమింతురు గాక.

20-3-18.
పీఠికాపురము.

పా. లక్ష్మీనరసింహారావు,
సంపాదకుఁడు.

శ్రీ

# స్వప్నకావ్యము.

## ప్రథమాధ్యాయము.

తొల్లి నిత్యమందాగ్నిబాధాసమాలబ్ధనిఖిలస్వప్నపరిపాటీవిచిత్రుం డగునామిత్రుండు, నాకుపదేశించినరీతిగా నేను నామిత్రులకు విన్నవించుకొనుస్వప్నకావ్యకథాక్రమం బెట్టిదనిన :—

రాత్రి పండ్రెండుగంట లయినది. తరువాతఁ బండ్రెండు దెబ్బలటోకాయింపైనది. కోటబురుజునుండి 'థమథమథమ్, థమథమథమ్' అని నౌబత్తుబజాయింపులు కప్పదాఁటులవలెఁ గర్ణములఁ బడుచున్నవి. వానినడుమను సన్నసన్నగా, మెల్లమెల్లగా సన్నాయివాదము తీఁగ పాఁకినట్లు ప్రాఁకుచున్నది. ఈనాదద్వయమునుసుతిగా మద్దెలగా సంగీకరించి, గొంతు సవరించుకొని హోర మింటికెత్తి, వీథికుక్క, పైస్థాయిలో ముఖారిరాగ మందుకొని చౌకపుధోరణితో సంగీతకాలక్షేప మారంభించినది. కంటికలకవతె గాన మంటురోగమగుటచేఁ బ్రక్క సందులలోనిపాటగాండ్రు సరసకళాగానధోరణిని శక్తివంచనలేకుండ జబాబుసంగతులను శరపరంపరలుగ విడుచుట వింటిని. ఈతోఁకనాటకులపాటలనాటకము విని వెగటుచెంది కాఁబోలుఁ జిరకాలమునుండి ప్రక్కయింటిపాడుదొడ్డిలోనుండి తీతువొకటి 'టిట్టిట్ట్రి' యనివెక్కిరించుచున్నది. ఆహా! ఒకరిపాట యన్న నొకరికి నచ్చదుకదా! అహాహా! ఒకరికవిత్వమన్న నొకరికి మొదలే నచ్చదుకదా! ఈయవకతవకలక్షణము—ఈదిక్కుమాలినయసూయ—ఒక్క మానువ్యజాతికిమాత్ర

మే కాదా? పశువులలోఁగూడ నీపావమా? పక్షులలోఁగూడ నీప్రారబ్ధమా?

× × × × ×

రవగాలి వీచుచున్నది. అదివఱకాకాశముఖమునఁ బ్రకాశించు జలతారంచునీలిమేలిముసుఁ గీగాలియూఁపున జాఱినది. నెత్తిపైనున్న చందురువంక నన్నుఁ జూడుమనుచున్నది. కొప్పులోనితారలు "కనిపట్టితిరా చంద్రునియహంభావము"ని కన్నుఁగీటుచున్నవి. గదిలోని యాముదపుదీపము 'మీలెక్క నాకే' మనితల కొంచెమెగరవేయుచున్నది. "వింటిరా? ప్రపంచమున నహాన మెంతసౌభాగ్యముగ వర్ధిల్లుచున్నదో" యని నవ్యకవిత్వమున నుపాలంభగీత మొకదోమ సామగానము చేయుచున్నది.

× × × ×

దోమ కెంతపొగరు? మశక మెక్కడ? మహాజగత్తెక్కడ? తానుప్రపంచపరిపాటిని బరిహాసించునంతటిప్రజ్ఞ కలదా? ఏమివిరుద్ధత! అత్యల్పజంతు వెక్కడ? అధికవిజ్ఞానసంపన్నుఁ డగుమనుజుఁ డెక్కడ?

× × × ×

మనుజుఁడు మహాఘనుఁడా? ఇంతమనుజుఁడు నాపైనున్నను నేను నలిగితినా? నాకు లేనిఘనత యాతని కెక్కడినుండి వచ్చెను? ఆతఁ డొకయంశమున ఘనుఁడైన నేనొకయంశమున గట్టిదాన నగుదును. లోకమున ఘనుఁడుకానివాఁ డెవ్వఁడు?' అందఱుఘనులే! ఆతనిదృష్టిచే నంద ఱల్పులే! అయినను నాయల్పతయెట్టిదో యాతనిఘనత యేదో కనఁబఱతు" నని చిటుక్కున నొకచీమ వీఁపుపై నంటఁబొడిచెను. "ఆహా! నల్లికుట్టినది కదా" యని యదరిపడిలేచి ప్రక్కను దీపకాంతిచేఁ జూచుకొనఁగ నవలోక్షజ్ఞానసంపన్న మగుపి

పిలిక కానఁబడెను. తానే బ్రహ్మమగుమానిసి వీఁపుపైఁ బొడిచినది నల్లియో చీమయో తెలిసికొనలేకపోవుచుంటిదని. 'టిట్టిట్టి' 'టిట్టిట్టి' యనుధ్వనితోఁ దీతువు తిరుగ వెక్కిరింప నారంభించెను.

అనేకకోటిభిన్నప్రకృతిసమాహార మైనయీసృష్టియంతయు నొక్కపరబ్రహ్మపరిణామమై యుండునా? కోటలో టంగున నొంటిగంట కొట్టినారు.

నిద్ర రాకుండ నున్నది. పట్టఁబోవుచున్ననిద్ర చీమ తనపొట్టను బెట్టుకొన్నది. చాఁపపఱచుకొని మఱియొకచోటఁ బండుకొంటిని. పయ్యెర వీఁచుచున్నది. పనసకాయకూరలో మెంతాదైనయావమే శవింపువలె హితమైన, సరసమైన రవంతచలి, చల్లగాలితోఁ గలిసి యున్నది. వేగముగానిద్రపోయి తీరవలయు నని నిశ్చయించుకొంటిని. కన్నులు గట్టిగమూసికొంటిని. మనసు స్తంభింపఁజేయ నుద్దేశించితిని. ఏనుఁగుతొండమును గదలకుండఁ జేయఁగలమా? పాదరసమును జలింపకుండఁ బట్టఁగలమా? గాలిస్తంభించినను రావియాకు కదలక మానునా? మనస్సు నరికట్టునుద్దేశముకూడ మనసులోనిచలనమే యగుటచేత ఈచలననాటకమునకు భరతవాక్య మెన్నఁడుసిద్ధించును? అక్షినిమీలనముచేతనే యంతరంగశాసన మగునప్పు డంధుఁడద్వైతపరబ్రహ్మముకంటె నన్యుఁడా? నిదురబోవనున్ననాకీగొడవ యెందులకు? నాగొడవయే నాకక్కఱలేనప్పు డది యితరుల కెందులకు?

× × × ×

కనుఱెప్పలపై సరసమైన సహ్యమైన రవంతబరు వొక్కటి యనుభవములో నున్నది. కన్నులు దెఱచుట కూహము లేదు. యత్నము లేదు. శక్తియు లేదు. ఈబరువు గురువైనకొలఁది లోపలితిరు

గులాడికాలు లఘువగుచున్నది కాఁబోలు. పైయాటలమారిభార్యకు బంధముహెచ్చినకొలఁది కడఁద్రొక్కుట ఘనమగును గాదా?

× × × ×

మనసునకు మునుపటికట్టుపాటు కనఁబడదు. మునుపటిక్రమ మున్నట్లు కనఁబడదు. మునుపటియాజ్ఞానువర్తిత్వ మున్నట్లు కనఁబడదు. గురునిశ్చయము తీఱినకుఱ్ఱనివలెఁ బలుపోకలు పోవుచున్నట్లున్నది. కళ్లెము తెగినకంఖాణమువలె బహుభంగులఁ బోవుచున్నది.

× × × ×

మొండిచేఁటలో దాఁబేలు కనఁబడినది. దానినిఁ బట్టుకొనుటకుఁ బోవఁగఁ గన్నులు గిఱ్ఱునఁ దిరిగినవి. ఒక్కత్రుటికిఁ గన్నులు విప్పుసరికి శూర్పణఖను కౌఁగిలించుకొని దానిభర్త కాఁబోలు బాఱెడు బాఱెడున కొక్కగట్టిముద్దు పెట్టుకొనుచున్నాఁడు. ఆహా! విశిష్టాద్వైతులసాపాటు చూడఁగూడదు కదా యని పత్రికకు మాఱలుసరికి "టూ లేటు" ముద్రితోఁ గూడఁ బదునొకండుముద్రలను లేఖాలయములో పెడిపెడి యని ముద్రించుచున్నారు.

× × × ×

గీరుగారనుచు నాకసమునఁ గొంగలబారగపడినది. అంతలో దడదడ వడగండ్లవాన గుఱిసినది. మింటిపైఁ గుంచముకంటె పెద్దతూటు పడినది. అంతలో నదేమొ యట్టెయట్టె యాకాశము క్రిందకు వ్రాలినది. ఆరంధ్రములోఁ దలఁదూర్చితిని. అంతలో రంధ్రము సన్నసన్నబడినట్లు కనఁబడినది. తల తప్పించుకొనుటకుఁ బ్రయత్నించుచుండఁగా ఢామనుధ్వని కాలిక్రింద నైనట్లుండెను. రప్పుమని యాకాశమొక్కసారి యుబ్బెత్తుగాఁ బైకి లేచెను. నేనుగూడ దానితోఁ బైకిఁ బోయితిని.

× × × ×

ఓ ! బంగారుభవనములు ! పచ్చలతోటలు! వెండినీటినదులు. ఆహా! అద్భుతముగ నున్నది. మనసూర్యుఁడంతకాంతితోఁ జంద్రుఁడై యట్టిచంద్రులు వేవురు పగలు రాత్రికాని సమయమునఁ బ్రకాశించిన నెట్లుండునో యక్కడనట్లున్నదని నేననుకొంటిని. దివ్యపుష్ప పరిమళములు ఘ్రాణతర్పణ మొనర్చుచున్నవి. బంగారుతామర పువ్వులలోనివరాగమున నిండినమందాకినీనీరముపైనుండి వచ్చినగాలి కాఁబోలును స్పర్శసుఖ మిచ్చుచున్నది. దేహమునకు మునుపు లేని పుష్టి బుద్ధికి మునుపు లేనిచాకచక్యము కంటికి మునుపు లేనిశైత్య ము కలిగినట్లు కానవచ్చెను. తిరుగ దగునంతవఱకుఁ బట్టనములోఁ దిరుగుటకు నిశ్చయించుకొని యొకవీధివెంటఁ బోవుచుంటిని. అక్కడఁగొందఱు మునిబాలకులు గూర్చుండి ప్రేంతగోముఖములను దులుపుచుఁ రుద్రాక్షలనుగ్రొత్తత్రాటఁ గ్రుచ్చుచు నోన్నమశ్శివాయ యనుమంత్ర ముచ్చైస్స్వరమునఁ బఠించుచున్నారు. మఱియొకవీధినిఁ బోవఁగ నొక్కయత్యంతసుందరభవనముగపడినది. దానిద్వారము నొద్ద స్వర్ణవేత్రహస్తులై యుద్ధులు “జయా! అసురాంతకసార్వభౌమా! జయా! అమరావతీనాథా! జయా! అహల్యామానచోరా! యని హెచ్చరించుచున్నారు. అప్పుడీపట్టన మేదో తెలిసినది. అనేకపాపకర్మములొనర్చిన నేను స్వర్గమున కెట్లురాఁగలిగితినని సందేహించితిని. ఇది స్వప్నమేమో యని వెంటనే కొంత నిశ్చయించుకొంటిని. సకలవైభవసంపన్నమై మహానందదాయక మగునాదివ్యదర్శనము ముందు పైఁబూర్వపక్షసిద్ధాంతములు పరాకుపడితిని. మఱియొకవీధి నిఁ బోవుచుంటిని. అక్కడఁ బెద్దద్రాక్షపందిరి కనఁబడినది. దాని క్రింద నొక్కదివ్యమంగళస్వరూపిణి యగుముప్పదియేండ్లకాంత కనఁబడినది. కాని దూరదృష్టి నామె బహుదురవస్థలో నున్నట్లు తెలిసి

కొని చేతనైనసాహాయ్య మొనర్పవలయునని సమీపించితిని. ఇద్దఱు శ్వేతశరీరధారులు (జర్మను లని యనుకొంటిని) నిద్దఱుతురకలు గలిసి యాదంగమజాంబూనదవిగ్రహమును దెఱపిలేకుండ నూపిరి విడువ కుండ మాటికిమాటికిఁ దలవెంట్రుకయంతయైన నెడము లేకుండము ద్దు పెట్టుకొనుచున్నారు' అప్పుడొకతురక నన్నుఁ జూచి « జారే!» అని కేకవైచెను. ఇంతలోఁ గొంచెము దూరమునఁ బచ్చఱాతిబండ పైఁ గూరుచుండినయెవ్వరో నన్నుఁ జేసన్న చేయఁగ నాతనియొద్దకు బోయితిని. అతఁడు వృద్ధుఁడు. సోమపాన మొనర్చినయాయజూకుఁడు వలెఁ గానఁబడినాఁడు. చంకను దర్భాసనమున్నది. చేత నుదకసహి తమగుకొమ్ముచెంబున్నది. అతఁడు నాతో నిట్లనియెను. 'నాయనా! నీవుగూడ రంభాపరీరంభమునకే వచ్చితివి కాఁబోలు. నేను బెద్దవాఁడ ను. చెప్పినమాట విని యిప్పుడుమాత్రము తొందరపడకు. ఈగడ్డా లఘర్షణ మేదో కడతేరినతరువాత మనమిద్దఱము కలిసి దానియొద్ద కుఁ బోవుదము. ఎవ్వరెన్ని చెప్పినసరే ఆ రంభగారికిమాత్రము బ్రా హ్మణునిమీఁదనున్నభక్తి పరజాతిమీఁద లేదు. అయినను నాయనా నీవెన్నిసారులు సోమపానము చేయుటచే నిక్కడకు వచ్చితివి. ఆమా టలువిని 'అయ్యా! నేనేకర్మము నెఱుఁగను. రాత్రిభోజనములోఁ దెలకపిండిచిక్కుడుకాయకూర రెండుమారులుకలుపుకొంటిని. ఆకూ రపరిమళ మిప్పటికి నోరూరఁజేయుచున్నదని నేనంటిని. 'చాలులే! చాలులే!' ఇఁకఁ జెప్పకు. నాకు నశ్లే యున్నది. దిక్కుమాలినసం స్కారాలు స్వర్గములోనికివచ్చినను వదలవుగదా' యని నిట్టూర్పువిడి చి యాసోమయాజి పలికెను.

అంత నేను మఱియొకవీధికిఁ బోఁగ నక్కడ నొక్కచెట్టుక్రింద పాలఱాతిపలకపై నిద్దఱు గూరుచుండిరి. నేను వారియొద్దకుఁ బోయి

చూచితిని. వారినిఁ జూచుటతోడనే మునిశిష్యులనైనను నమస్కరిం పనివాఁడను సాష్టాంగపడ మనసయ్యెను. వారు నన్ను దీవింపలేదు. నావంకఁ జూడలేదు. అంధ్రులవలెఁ బూజ్యులవలె—వారు నాకుఁ గానఁబడుటచేత నక్కడఁ గూరుచుంటిని. వారిట్లు మాటలాడుకొను చుండిరి.

ఒకఁడు :—ఏలాగునన్నైన దైవకృతి దైవకృతియే మనుజకృతి మనుజకృతియే.

రెండ—నేనైనను భారతము రాజరాజనరేంద్రునకుఁ గృతి సేయకయే పోదును. ఆయన ప్రీత్యాసక్తిగా నంతప్రార్థించినప్పు డీయకుండుట బాగుగా నుండదని యట్లు చేసితిని. నేనీయకపోయిన మఱియెవ్వరైన నిచ్చియుందురు. ఆప్రభువునకు లోపము లేదు. ఆంధ్రభారతము పైకిరాకనుపోదు. కాని నేను భారతకవి నన్నమాట నాకుమాత్రము దక్కియుండదని నావిష్ణుఃపృథ్వీపతియన్న న్యాయము చేత మనస్సును సమాధానపఱచుకొని యట్లు చేసితిని.నీవు నాకంటె నదృష్టవంతుఁడవు. నరకృతిబాధ లేకుండ దాఁటుకొని వచ్చితివి. అప్పుడు వారిలో నొకఁడు నన్నయభట్టని రెండవయాతఁడు తిక్కన సోమయాజి యని నేననుకొంటిని.

తిక్క—ఏది? నాకుమాత్రము నరకృతి లేనియదృష్టమేది? ఆకక్కుఱితి మానిర్వచనోత్తరరామాయణమునఁ దీరినదికాదా?

నేను—మహాకవులారా! ఆవిషయమున బమ్మెరపోతనామాత్యున కందినవా రెవ్వరు పూర్వులలో లేరు.

తిక్క—ఆసంగతి కర్ణాకర్ణిగా నిక్కడివారివలన వినియుంటిమి.

నన్న—మీ రెవ్వరు?

నేను—నన్నయభట్టుగారూ! మీ రేనదీపవిత్రోదకముద్రా

వితిరో యానీకు నేనును దాఁపివినవాఁడనే. నేనాంధ్రుఁడను. మీరేప ట్టనమున భారతకృతిరచియించితిరో యాపట్టనమున నేను వసించు వాఁడను.

నన్న—అలాఁగా! నాయనా! సంతోషమే.

తిక్క—భూలోకములోనివిశేషము లేమయినఁ జెప్పెదవా? విందుము.

నేను—అభ్యంతర మేమి? మొదటిది. ఇఁక మీభారతము పైసకు మారదని నానమ్మకము.

తిక్క—ఎందుచేత?

నేను—సంస్కృతభారతమును నేనెఱిఁగినంతవఱకు ముప్వురాంధ్రీకరించుచున్నారు.

తిక్క—మావలెనే కొన్నిపర్వము లొకరు కొన్నిపర్వము లొకరు చేయుచున్నారా?

నేను—అట్లు కాదు. ఎవరిమట్టునకు వారు పూర్తిగనే చేయుచున్నారు.

తిక్క—వారు మాకంటె గట్టికవులా యేమి?

నేను—ఘటములు పూర్తియగువఱకు గట్టియో యోటియో యెట్లు తెలియఁగలము?

తిక్క—అదేమిమాట? "మదమాతంగతురంగకాంచనX" యనునన్నయభట్టారకునిపద్య మొకటి సర్వకవులకుఁ గవితాపరీక్షార్థమై పంపఁబడియుండలేదా? దానికి వర్ణము వేసి తిరుగ దానిని మేము పంపియుండ లేదా? కవిత్వఘునతకనిపట్టుట కొకపద్యము చాలదా? పదివేలపద్యములలోనైన యథార్థకవిత యుండకపోవచ్చును. సహజకల్పనాసంయుక్తమై సందర్భశుద్ధిసహితమై తేజస్సమన్వితమై యొక్క

పద్యమైన సరే కాక యొక్క వాక్యమైనసరే కవిత్వ మనిపించుకొనును గణబద్ధమైన కావడిగ్రంథమైనను రసహీన మైనయెడలగత్త మనిపించుకొనునుగాని కవిత్వ మనిపించుకొనదు.

నన్న—తిక్కయజ్వగారూ! ఇన్ని మాట లెందులకు? ఈకాలములోనైన భూమియందు గొప్పకవు లుండవచ్చును. కాని నాయధిక్షేపణ మేమనఁగా మంచియో చెడ్డయో మేము చిరకాలముక్రిందఁ గష్టపడి వ్రాసినగ్రంథమును దిరుగ నొకరు వ్రాసిన వినియోగ మేమున్నది? మేమేమిలోపము లాచరించితి మని మఱియొకరు వ్రాయవలయును. ఇట్లు చర్విత చర్వణముగా గ్రంథములు వ్రాసినయెడల సారస్వతాభివృద్ధి యెట్లగును? ఒక్కొక్కగ్రంథము సరస్వతి కొక్కముందడుగుగా నుండవలయును. అంతేకాని గ్రంథరచనయం దీగుడుగుడుగుంచము లెందులకు? కవితానది యసాధారణవేగమున ముందునకుఁ బ్రవహింపవలయును గాని సుడిగుండములలో గిఱ్ఱఁదిరిగిన యెడల దైర్ఘ్యమునకు వైశాల్యమునకు నవకాశ మేది? కావుననాధుని కులయాంధ్రభారతరచన నామనస్సునకు బాగుగాలేదు.

నేను—భట్టోజీగారూ! మీకాలములోనే పుట్టినభారతమును మీరు సహింపలేనిమహానుభావులు. ఇప్పటిభారతమును సహింతురా?

నన్న—అట్లనుచుంటి వేల?

నేను—అథర్వణాచార్యులవారిభారతము మీభారతముకంటె బాగుగా నుండుటచేత దానికిఁ బ్రభుకృతిగౌరవము గలుగకుండ దానిని ధ్వస్తపఱచినవారు మీరేకారా?

నన్న—అయ్యో! నాపై భూలోకమున నిట్టియపవాదమున్నదా? యథార్థము చెప్పెదను. వినుము. ఆకాలమునాఁడు జైనమత మడుగంటుచున్నది. బ్రాహ్మణమతము తిరుగఁ బైకి వచ్చుచున్నది.

అప్పటిప్రభువు బ్రాహ్మణపక్షపాతి. అథర్వణుఁడు జైనుఁడు. అందుచే జైనమతానహానముఁ బ్రభువే యాతనికృతి నందుటకు నిరాకరించినాఁడు. నేనేదోష మెఱుఁగను.

తిక్క—అనవసర మైనయీపూర్వగాథ లేల?

నేను—తిక్కన్నగారూ! మీరు మఱింత మహానుభావులు. పూర్వగాథలు వినుటకు మీకిప్పు డిష్టముండునా? నన్నయ్యగారు జైనమతగ్రంథము నే రూపుమాపెనుకాని మీర నేకజైనులను రూపుమాపినారు.

తిక్క—ఔను. ఊరకేనా? వాదమునఁ—జావఁగొట్టి జయపత్రమంది—మాగంటమునకుఁ గత్తికి నొక్కటే వాడి. అయిన నీగోడవయేల? మాభారతమును ధ్వస్తపఱచుచున్నట్లు మాతాతగారి రామాయణమునుగూడ నెవ్వరైన ధ్వస్తపఱచిరా?

నేను—ఒకరా? నల్గురు. రామాయణమంతయు దృశ్యప్రబంధముగా సాగఁదీసిన పేదుపొట్లాలక్రింద నవరాలక్రింద తేటగీతలక్రింద తెయితక్కలక్రింద లాగిన పెద్దమనుష్యుఁడు మఱియొక్కఁడున్నాఁడు.

నన్న—రామాయణముసంగతి వేఱు. అది యెందఱు వ్రాసినను వ్రాయఁదగినదే. దానిమాహాత్మ్య మట్టిది. సోమయాజిగారూ! ఏనిర్వచనమో యేయుత్తరమో వ్రాసి మీతాతగారిది మీరే కొంత ధ్వస్తపఱచినారుకాదా? ఇఁకఁ బైవారి నధిక్షేపించుట యెందులకు? నేనుమాత్రము రాఘవాభ్యుదయము వ్రాయలేదా? దానిని ధ్వస్తపఱచుటకే మీతాతగారు రామాయణము వ్రాసినారా యేమి? బాగున కెక్కడికి? ఓగున కెక్కడికి? బొత్తుగా బాగులేక మిక్కిలితీసికట్టుగా నున్నప్పుడుగాని యేగ్రంథమును దిరుగ వ్రాయుటకు వేఱొకఁడు పూనుకొనఁగూడదు. ఏమి! సోమయాజిగారూ! నేఁజెప్పినమాట న

త్యమే కాదా ?

తిక్క — మీరు సత్యము మాత్రమే చెప్పినారు కాని నేను మీరన్న సత్యమును దైవముఖమునఁ జూచి యాచరించితిని. మీరు రెండు పర్వములనర వ్రాసి విడిచిన తరువాత విరాటపర్వమునుండియే నేను భారతమును వ్రాయలేదా ? మీరు వ్రాసినదాని నేమైనఁ దాఁకితినా ? పదునైదు పర్వములు గుక్కత్రిప్పకుండఁ జెప్పి వ్రాయించినవానికి మిగిలిన మూఁడు పర్వములేమి లెక్క ? మీరు వ్రాసినభాగమును గూడ నేనే వ్రాసియుండినయెడల మీభారతమున కీప్రపంచమునఁ బ్రసక్తి యుండునా ?

నన్న — అ! అ! అంతమాటయెందులకు ! నాయనా ! ప్రసక్తి యుండునో యుండకపోవునో — జరుగనిసంగతుల పర్యవసానముతోఁ బనియేమి ? నాకుఁ బ్రాప్తి లేకపోయినది. కాని మిగిలినపర్వములు నేనుమాత్రము వ్రాయలేనివాఁడనా ?

నేను — మహాకవులారా ! మీరిద్దఱు సములే. మీకన్యోన్య మత్సరముతోఁ బనిలేదు. తిక్కన్నగారికవిత్వములోఁ గొంచెము పెళుసుదనము, నన్వయకాఠిన్యము, శబ్దములబిగియు నుండును. నన్నయగారికవిత్వములోఁ గొంచెము లఘుత్వము, వదులుతనము, అనవసరసంస్కృతపదభూయిష్ఠత గలవు. గుణము లిద్దఱుకవితలోను సమానముగనే యుండును.

తిక్క — నీవు మమ్ము భూషింపవలదు. దూషింపవలదు.

నేను — చిత్తము. చిత్తము. దూషణభూషణవిషయములలోఁ దరువాత మనవి చేసికొందును. నన్నయగారూ ! మీరెక్కడవారా? నారాయణభట్టెక్కడవాఁడా? ఈసందేహము కొంత బాధించుచున్నది

నన్న — అట్లేలయడిగితివి ?

నేను—“పాయక పాకశాసనుఁడు భారతఘోరరణంబునందు నా, రాయణునట్లు” అనియున్నది. కృష్ణుఁడే క్రీడిప్రాణము కదా! సైంధవవధదినమున కృష్ణుఁడు చక్రము వద్దు పెట్టకుండిన యెడల క్రీడిపస యెట్టిదో తెలిసియుండును. పార్థసారథియే లేనియెడల పరశురామశాసకుఁడైన తాతగారొక్కదినముననే పార్థునితలప్రాణము తోఁకవఱకు వచ్చునట్లు చేసియుండును. ఇంతయెందులకు? నరనారాయణులు రథముదిగినవెంటనే యదివఱకుఁ గృష్ణభగవానుని మాహాత్మ్యమున నడఁపఁబడియున్న బాణాగ్నిచే నొక్కసారి రథమంతయుఁ గాలిపోలేదా? అదియటుండనిండు. కృష్ణనిర్యాణమైనతరువాత నీసవ్యసాచి గోపికల నేమాత్రము కావఁగలిగెనో యెఱుఁగరా? కృష్ణుఁడు లేనికవ్వడి గవ్వకన్నఘనుఁడా? ఈయుపమానమువలన నారాయణభట్టుముందు మీరుకూడ నట్లేమోయని తోఁచుచున్నది. క్షమింపవలెను.

తిక్క—(తనలో) వ్రాసిన యీరెండుపర్వములనఱకే మఱియొకని సాహాయ్య మీకవికిఁ గావలసివచ్చియుండఁ బదునెన్మిదిపర్వములు తా నేవ్రాయఁగలనను ప్రతిభ లేల?

నన్న—నారాయణభట్టు నాసహపాఠి. మహాబుద్ధిశాలి. నాయనా! ఒక్కమాట. మనసహపాఠిని మిత్రుని గ్రంథరచనయందు మనకు సాహాయ్యముచేసినవాని నెప్పుడుకూడ మనకంటె ఘనుఁడనియే వర్ణించుచుండవలయును. నాయనా! తోడికవిప్రాణము సంతోషించుట కింతకంటె సురుచిరమైనమార్గ మున్నదా?

నేను—సురుచిరమేమో నేనెఱుఁగనుగాని శుద్ధవైదికముమాత్రమగును, ఇందువలనఁ గవితారతమ్యము కప్పవడిపోవును.

తిక్క—ఆమాటయసత్యము. వివేచనాశక్తియున్న విమర్శకుఁడొక్కపద్యముతో నెవఁడుఘనుఁడో కనిపెట్టఁగలఁడు. లక్ష చెప్పఁడు.

కోటిచెప్పఁడు. ప్రస్తుతకవు లింకఁబదునాలుగుభారతములు వ్రాయ నిందు. అవియన్నియు మాభారతమునుందుఁ బ్రాణహీనములై పోవ లసినవేకాని యన్యథాకాదు. మాభారతమొకటియే యాచంద్రార్క ముగా నిలువఁదగినదని నానిశ్చితము.

నేను—ఆమాటయుఁ గొంతనిజమే కాని యథర్వణాచార్యుల భారతము దొరికినయెడల మిాభారతము మాత్రము తలక్రిందియెత్తుల కంటె నెక్కువయుపయోగపడదేమోయని భయపడుచున్నాను.

తిక్క—నీమొగముచూడఁగా నీవు భారతమెన్నఁడుచదివినట్లే యగపడదు. నీబుద్ధికిఁ దగినట్లే మాటలాడుచుంటివి. చాలు! ఇఁక విశేషవాగ్వ్యయముతోఁ బనిలేదు.

నేను—మిాకు నేను శ్రమమిాతును. నన్నయతాతగారూ? నారాయణభట్టుశాసనము వ్రాసినవారు మిారేకారా? అతని కట్టియు పకృతికిఁగూడఁ గారకులు మిారేయైయుందురుకదా! ప్రభువు మిాకే యగ్రహారమిచ్చినట్లెక్కడను గనఁబడదేమి?

నన్న—కనఁబడదా? వెదకినవారేరి? వెదకించినవారేరి? ప్రభువులలో నేమహానుభావులిందునుగూర్చి విశేషోత్సాహముతోఁ బని చేయుచున్నారో చెప్పు.

నేను—ఆంగ్లేయప్రభువు లిందునుగూర్చి శ్రమమొనర్చుచునే యున్నారు.

నన్న—నాయనా! ఆంగ్లేయప్రభువులెవ్వరో గొప్పవారై యుందురు. వారుపరరాజులని వినుచున్నాను. దేవతార్చనపేటికలోఁ బెట్టికొనిపూజించు శాసనములు సద్గ్రంథములు దేశీయప్రభువుల కిచ్చెదరుకాని పైవారి కేలయిచ్చెదరు? స్వదేశప్రభువు లెవ్వరైన మహోదారులు, భాషాభిమానులీమహాకార్యమునకుఁ బూనుకొన్నచో

భావిసారస్వతచరిత్రాంశములపై సూర్యప్రభానిభమైన దీప్తి పడుట కేమైన సందేహమా ?

తిక్క——నిజమే. దేహముబాసి యిక్కడ కప్పుడప్పుడువచ్చుచున్న పండితులను గవులను నేను గలిసికొని భూలోకవార్తలఁ గనుగొనుట నాకలవాటు. ఇప్పుడు కవులు తండోపతండములుగ నున్నారఁట ! కవిత్వముచెప్పలేనివాఁ డొక్కఁడును లేఁడఁట ! వీరందఱు గ్రంథములు వ్రాయుచున్నారఁట. కాలమెప్పుడో యీపనికిమాలిన గ్రంథములను నశింపఁజేయునని యూరకుండఁదగదు. పూర్వకవులతో సమానులగుకవు లీకాలమునఁ బుట్టుట యసత్యము. యథార్థకవిత్వపుఁగాలము దాఁటిపోయినది. ఇది విమర్శకశకము. ఈకాలప్రభువులిప్పుడు కవులనుబోషించుటకంటె విమర్శకులను బోషించుట మిగుల భాషోపయోగకరము. ఇప్పుడుబయలుదేరుచున్న పనికిమాలినగ్రంథములను భంజించుటకు విమర్శకు లనేకులు కావలయును. ఎలుకలు విశేషముగాఁ బెఱిగి మహామారిని వృద్ధిచేయుకాలమున నెన్నియెలుకలబోనులను జాగ్రత్తపెట్టిన నంతమంచిదికాదా? ఇది యిప్పటిప్రభువుల కర్తవ్యము.

నేను——బాగుగానేయున్నదికాని మంచియెలుకయేదో మారియెలుకయేదో తెలిసికొనకుండ నన్నిటినిఁజంపినయెడల బాగుగనుండునా ?

తిక్క——నేఁజెప్పినది నీకుబోధయేకాలేదా ? విమర్శకుఁడుచేయుపని యదియేకాదా?

సశేషము.

# పులిబూరుశాసనములు.

ఈశాసనములు రెండును గోదావరీమండలములోని రామచంద్రపురంతాలూకాలోఁ జేరిన పొలమూరుగ్రామమును బ్రాహ్మణుల కు దానముఁ జేసినవిషయమును దెలుపుచున్నవి.

వీనిలో మొదటిది మాధవవర్మశాసనము. ఇది యారున్నరఅంగుళములపొడవు రెండున్నరఅంగుళములవెడల్పుగల నాలుగు రాగిరేకులపై వ్రాయఁబడినది. రేకులకెడమభాగమున నడుమ గుండ్రనిచిల్లులు పొడిచి వానిగుండ రేకులొకరాగికంకణమునకు గ్రుచ్చబడినవి. మొదటికడపటిరేకుల పైభాగమున నేమియు వ్రాయఁబడలేదు. 2.3. 4.5.7 వ్రక్కల నేడేసిపంక్తులును 6 వవ్రక్కనుమాత్ర మూఁడుపంక్తులును సంస్కృతభాషలో గద్యపద్యాత్మకముగ వ్రాయఁబడినవి. రెండవది జయసింహవల్లభమహారాజశాసనము.

ఇది 6½ అంగుళములపొడవు 2½ అంగుళములవెడల్పుగల మూఁడు రాగిరేకులమీఁద వ్రాయఁబడినది. మొదటికడపటిరేకుల పైభాగమున నేమియు వ్రాయఁబడలేదు. 2.3.4.5 వ్రక్కల నారుపంక్తులచొ॥ సంస్కృతభాషలో గద్యపద్యాత్మకముగ వ్రాయఁబడినది.

ఆశాసనముల నిచట బొందుపరచి వానితాత్పర్యములను సంగ్రహముగా వ్రాసి వానివలన నాకుఁదోచిన యప్పటియాంధ్రదేశస్థితిని గొంచెము వివరించుచున్నాను.

## 1 మాధవవర్మశాసనము.

స్వస్తి భగవచ్ఛ్రీపర్వతస్వామి పాదానుధ్యాతస్య, విష్ణుకుండిన స్యాఽ.వ్రతిహతశాసనస్య.స్వప్రతాపోపనత సామంతమనుజపతిమండ

లస్య. విరహితరిపుషడ్వర్గస్య, విధింమపవిత్ర త్రివర్గస్య, విబుధపతిసా
ధ్య శరవీరవిభవబలపరాక్రమస్య, (శ్రీవిక్రమమహాన్ద్రస్య సూనో, రనేక
సమరసంఘట్టవిజయినః పరనరపతిమకుట మణిమయూఖావదాత చర
ణయుగళస్య, విక్రమాశ్రియస్య, శ్రీగోవిందవర్మణః, ప్రియతనయః
అతులబలపరాక్రమ యశోదానవినయసహానో, వశంగతసకలధరణీ
తలనరపతి, రవసిత(వివిధ)దివ్యస్త్రీ వరనగరభవనగత పరమయువతీజ
న విహారణరతి, రనన్యనృపతిసాధారణ దాన,మాన,దయా,దమ,ధృ
తి,మతి,క్షాంతి,కాంతి,శౌర్యౌదార్య,గాంభీర్య,ప్రభృత్యనేకగుణ స్న
హోజ్జనిత రయసముత్థిత సుమనోలభ్యాది విపులయశాః, క్రతుసహా
స్రయాజి హిరణ్యగర్భప్రసూతః, ఏకాదశాశ్వమేధావబృథస్నాన వి
గతజగదేనస్కః, సర్వభూతపరిరక్షణచుంచుః, విద్వద్విజగురు వృద్ధతప
స్విజనాశ్రయో, మహారాజః శ్రీమాధవర్మా అపిచ వనియ(మిత)గణ
సం,సత్వం,కోశంవా'కాంతి,మైన్దవీం ఉద్వహన్నురుగాగాతి. విక్రమా
దాప్తభూరిఘోః అప్యసౌ మహీతలనృపతిభాసురః, పరమబ్రహ్మణ్యో
మాతాపితృపదానుధ్యాతః జనాశ్రయమహారాజః గుద్దవాడివిషయే
విషయమహత్తరా నధికారపురుషాంశ్చ ఇమమిత్థ మాజ్ఞాపయతి. అ
స్తు విదితమస్తువో యోజస్మాభిః గుద్దవాడివిషయె దట్టాయవాటితిరపులి
బూరునామ గ్రామం మయేన్ద్రవాటకిదక్షిణతః సీమాంతచతృభి ర్వ
గ్రసంచ క్షేత్ర యుగపాతపూత పూంగ్దిజిగీషయా ప్రస్థితః గోదావరీ
మతితరణ వేదవేదాంగవిదో రుద్రశర్మణో నప్త్రే, స్వపితు రధికగు
ణోధ్యసితానాం దామశర్మణః పుత్రాయ, శివశర్మణే, గౌతమసగో
త్రాయ, కమ్మరాష్ట్ర కుందుకవాస్తవ్యాయ, తైత్తిరికసబ్రహ్మచారి
ణే, వేదచతుష్టయ సమామ్నాతావదాతాననాయ, స్వకర్మానుష్ఠా
నపరాయ, ఫాల్గుణ్య పౌర్ణమాస్యాం సోమరాహుసగ్రహనిమిత్త జనాక్ష

యః దత్వా సర్వకరపరిహారేణాగ్రహారీకృత్య సంప్రత్తః తదత్రభవ ద్భి రన్యైశ్చ ధర్మాధిగతబుద్ధిభిః పరిపాలనీయః నకైశ్చి ద్బాధా కర ణీయా ఆజ్ఞప్తిరత్ర హస్తికేశ వీరకేశౌ మహాన్ప. మాత్రయోధ యాస్తేషాం శ్రియోమూర్తిరిదంమహాత్. యోనలోభేన లుంపంతి శ్వపాకస్థేషు జాయతే. అన్యాయనమకాలేతు స్థాతవ్యశ్శక్తిగః పురా ఉపేక్షతిపునర్యత్ర నరకే స నిమజ్జతి.

ఇత్యేవముభయగణో స్వీకృత్య పరిపాలయేత్. అత్ర వ్యాస గీ తాశ్లోకః.

బహుభి ర్వసుధా దత్తా బహుభి శ్చానుపాలితా. యస్యయస్య యదాభూమి స్తస్యతస్య దదాఫలం.

స్వదత్తాం పరదత్తాంవా. యోహరేతి వసుంధరాం. షష్టివర్షస హస్రాణి విష్టాయాం జాయతే క్రిమిః. షష్టివర్షసహస్రాణి స్వర్గేమో దతి భూమిదః. అక్షత్తా చానుమంతాచ తాన్యవనకవసేత్.

నవిషంవిషమిత్యాహుః బ్రహ్మస్వం విషముచ్యతే
విషమేకాకినం హంతి బ్రహ్మస్వం పుత్రపౌత్రకం.

విజయరాజ్యసంవత్సర(...)

**తాత్పర్యము.**

శ్రీపర్వతస్వామి(శ్రీశైలస్వామి)పాదభక్తుఁడును విష్ణుకుండిన వంశీకుఁడును అప్రతిహతప్రతాపుఁడును అగు విక్రమహార్షునకు ననేకస మరవిజయుఁడును విక్రమాశ్రయుఁడును నైన గోవిందవర్మయును కొ మరుఁడు గలఁడు. అసమాన దాన,మాన,దయా,దమ,ధృతి,మతి,క్షాం తి,కాంతి,శౌర్యౌదార్యాద్యనేకసుగుణవిరాజితుఁడును ఏకాదశాశ్వమే ధావబృథస్నాన శోభితుఁడునైన మాధవవర్మ గోవిందవర్మకు బుత్రుఁ డు. కమ్మరాష్ట్ర కుడుకవాస్తవ్యుఁడును గౌతమ సగోత్రుఁడును దా

మశర్మకు బుత్రుడునైన శివశర్మకు ఫాల్గుణపూర్ణిమాసోమగ్రహణ కాలమున గుద్దవాడివిషయమున దట్టాయువాటితీరమున పొలమూరు గ్రామమును పూంగ్ది(పూకి)దేశమును జయించునిచ్ఛతో గోదావరిని దాటుచు సర్వకరపరిహారముగా నగ్రహారమొసర్చి దానమొసంగెన ని పైశాసనము తెలుపుచున్నది.

2 జయసింహవల్లభమహారాజశాసనము.

సస్తి శ్రీవిజయస్తన్నాచరతి మాతృగణపరిరక్షితానాం, మానవ్యసగోత్రాణాం, హారితిపుత్రాణాం, అశ్వమేధయాజినాం, చలుక్యానాం, కులజలనిధి సముత్పన్న రాజరత్నస్య, సకలభువనమండల మండితకీర్తి శ్రీకీర్తివర్మణః పౌత్రః అనేకసమరసంఘట్టవిజయినః పరనరపతిమకుట మణిమయూఖావదాత చరణయుగస్య, శ్రీవిష్ణువర్ధనమహారాజస్య ప్రియతనయః ప్రవర్ధమాన ప్రతాపోపనత సమస్తసామంతమండలః స్వబాహుబల పరాక్రమోపార్జిత సకలయశోవిభాసిత దిగన్తరః. స్వశక్తిత్రయ త్రిశూలావభిన్నః పరనరపతి సకలబలచేతనః బృహస్పతిరివ నయజ్ఞః మనురివ వినయజ్ఞః యుధిష్ఠిరఇవ ధర్మపరాయణః అర్జునవ దపరనరపతిభి రనవిలంఘితసామర్థ్యః అనేకశాస్త్రార్థ తత్వజ్ఞః పరమబ్రహ్మణ్యో మాతాపితృపదానుధ్యాతః శ్రీపృథివీజయసింహవల్లభమహారాజః గుద్దవాడివిషయే విషయమహత్తరా నధికారపురుషాంశ్చ ఇమమిత్థ మాజ్ఞాపయత్యస్తి విదితమస్తువో యుష్మాభిః గుద్దవాడివిషయే పులిబూరన్నామగ్రామః. వేదవేదాంగవిదో దామశర్మణః పౌత్రాయ, స్వపితు రధికగుణగణాధివాసస్య శివశర్మణః పుత్రాయ, తైత్తిరీకసబ్రహ్మచారిణే, వేదద్వయాలంకృతశరీరాయ, గౌతమసగోత్రాయ, స్వకర్మానుష్ఠానపరాయ, పూర్వాగ్రహారిక దుప్రిశర్మణే. అసనపురస్థాన వాస్తవ్యాయ. శ్రీసర్వసిద్ధిః దత్వా సర్వక

రవరిహారేణాగ్రహారీకృత్య సంప్రదత్తః. తథా భవద్భిరన్యైశ్చ ధర్మాధిగతబుద్ధిభిః పరిపాలనీయః నకైశ్చి ద్బాధా కరణీయా. ఆజ్ఞప్తిరత్ర హాస్తికోశ,వీరకోశౌ న్యానగీతౌః.

శ్లో. బహుభి ర్వసుధా దత్తా బహుభి శ్చానుపాలితా యస్య యస్య యదా భూమి స్తస్యతస్య తదా ఫలమితి.

తాత్పర్యము.

విష్ణువర్ధనమహారాజునకుఁ బుత్త్రుఁడైన జయసింహవల్లభ మహారాజు అసనపురవాస్తవ్యుఁడును, వేదవేదాంగవిదుఁడగు దామశర్మకు పౌత్రుఁడును, స్వపిత్రనేకగుణగణాన్వితుఁడగు శివశర్మకుఁ బుత్త్రుఁడును, తైత్తిరీకసబ్రహ్మచారియు వేదద్వయాలంకృతశరీరుఁడును, గౌతమసగోత్రికుఁడును, స్వకర్మానుష్ఠానపరుఁడును, పూర్వాగ్రహారికుఁడునునగు రుద్రశర్మకు గుద్దవాడివిషయమందలి పొలమూరుగ్రామమును పన్నులను పరిహరించి యిచ్చెనని యీశాసనమువలన దెలియుచున్నది.

పైనిచెప్పఁబడిన రెండుశాసనములవలనను 7వశతాబ్దమునం దాంధ్రదేశమునందలి సాంఘిక, రాజకీయ, స్థితులు కొంతవఱకు బోధపడుచున్నవి. మొదటిశాసనమునందలి మాధవవర్మకాల. మిదమిత్థమని నేటివఱకు చారిత్రకులు నిర్ణయించియుండలేదుకాని జయసింహవల్లభునిదగు రెండవశాసనమువలన మాధవవర్మయొక్క కాలము స్పష్టమగుచున్నది. జయసింహవల్లభుఁడు క్రీ. శ. 633 మొదలు 663 వఱకును, ఉదయపుర"మునందుండి రాజ్యముచేసెనని చారిత్రకులు నిర్ణయించియున్నారు. జయసింహవల్లభునితండ్రి "కుబ్జవిష్ణువర్ధనుఁడు" క్రీ. శ. 615 మొదలు 633వఱకును వేంగీదేశమును జయించి "పీఠాపురము" రాజధానిగాఁ జేసికొని పాలించినటుల ప్రసిద్ధవిషయము. మా

ధవవర్మచే దానమును స్వీకరించిన "శివశర్మ" తండ్రి,,(2)దామశర్మ" తాత,,(3) ఇంద్రశర్మ,,యై యుండెను. జయసింహవల్లభునిచే దానము నందిన (1)రుద్రశర్మ,,తండ్రి( )శివశర్మ తాత(3)దామశర్మ,,యైయుండెను. అనగా మాధవవర్మచే దానమునందిన శివశర్మయొక్క కుమారునికే జయసింహవల్లభుడు దానమిచ్చియుండుటచేతను రుద్రశర్మకు చెప్పబడినవిశేషణములలో "పూర్వాగ్రహారిక రుద్రశర్మణే"యని వ్రాసియుండుటచేతను మొదటిదానమునకును రెండవదానమునకును మధ్యకాలము నలువదియేబదిసం॥రములకు లోపుకాలమై యుండును. ఇంతియగాక మాధవవర్మదానకాలము "ఫాల్గున్యపౌర్ణమాస్యాం సోమరాహుగ్రహనిమిత్తం,, అని యుండుటచేతను క్రీ. శ. 609సం॥రము పిబ్రవరిలో నట్టిరాహుగ్రస్తసోమోపరాగము వెనుకకువెక్కించిచూడగ సంభవించియుండుటచేతను క్రీ శ. 615సం॥రమున కుబ్జవిష్ణువర్ధనుడు రాజ్యమునాక్రమించుటచేతను మాధవవర్మ శివశర్మకు దానమిచ్చునాటికే "ఏకాదశాశ్వమేధావభృథస్నానజనితదేనస్కః"అను విశేషణముతో నొప్పియుండుటచేతను ఒక్కొకయశ్వమేధమునకొక్కొకసం॥రకాలము కావలసియుండుటచేతను రాజ్యమునకు వచ్చినవెంటనే యశ్వమేధముఁజేయక కొంతకాలము రాజ్యముఁజేసినపిమ్మటనే యాగములనారంభించి యుండునుగాన క్రీ. శ 609కిపూర్వము 20సం॥రములైనను మాధవవర్మ రాజ్యముంజేసెననితలంచవలసియున్నది. ఇంతియగాక శ్రీచిలుకూరి వీరభద్రరావుగారు ఆంధ్రులచరిత్రమొదటివాల్యము 360పుటయందీతనిని వర్ణించుచు నీతనిపోతుని శాసనప్రకారము మాధవవర్మ నరమేధయాగముఁజేసెనని కలదనిరి. ఆనరమేధము క్రీ. శ. 609కి 615కి మధ్యకాలమున జరిగియుండును. కుబ్జవిష్ణువర్ధనునిపాత్రిగాంధ్రదిగ్విజయమున నెవనిని జయించి దేశము

నాక్రమించెనో నేటివఱకు తెలియదుకాని యీరెండుశాసనము లకాలముఁబట్టి మాధవవర్మ నేయుద్ధమున నోడించియో వధించియో యీదేశమునాక్రమించియుండును. మాధవవర్మయొక్కయు అతనిపౌత్రుఁడగు నింద్రవర్మయొక్కయు శాసనముల నాలోచింపగా మాధవవర్మ గుంటూరుమండలములోని వినుకొండప్రాంతమునకు రాజయియుండి విశాఖపట్టణపుమండలములోని "చీపురుపల్లె"ను జయింపబోయి యుండుటచేతను "ఇందద్రివర్మ" కళింగదేశాధీశుఁడుగా వర్ణింపఁబడియుండుటయేకాక తత్ప్రాంతమున నాతనిశాసనములు దొరకుటచేతను యించుమించు తెనుఁగుదేశమంతయు విష్ణుకుండినుల కొకకాలమున స్వాధీనమై యుండెనని నమ్మవలసియున్నది. మాధవవర్మయొక్క నరమేధయాగమే యాతని రాజ్యవిచ్ఛిత్తునకు గారణమై యుండును. నరమేధయాగమున బలివేయఁబడు పురుషుఁడు వేదవేత్తయగు బ్రాహ్మణుడో రాజచిహ్నలుగల రాజపురుషుఁడో కావలసియుండును. ఈయాగమున వధింపఁబడిన పురుషుని సంబంధీకులు మహారాష్ట్రరాజయిచక్రవర్తియై యాకాలమున నుత్తరహిందూస్థానము నంతయు సవక్రపరాక్రమముతోఁ బాలించిన "శ్రీహర్షునే"యోడించిన పులికేశియొక్క శరణుజొచ్చియుండురు. మాధవవర్మ యాంధ్రదేశమునంతయు నోడించి "అశ్వమేధము"లం జేసినపరాక్రమవంతుఁడు పులికేశి 606స॥ర ప్రాంతమున "శ్రీహర్షునోడించియుండెను. 609ప్రాంతమున మాధవవర్మ ప్రాగ్దిగ్విజయయాత్రం జేసెను. అందువలన పులికేశికి ప్రాగుత్తరములయందు మహారాజ్యములుండుట తనకెప్పటికైనను ముప్పునకుఁ గారణమగునని మాధవవర్మపై దండయాత్రను సాగింప దమ్ముఁడగు కుబ్జవిష్ణువర్ధనున కాజ్ఞనిడియుండును. మాధవవర్మపౌత్రుఁడు కళింగదేశము నేలియుండుటయేకాక జయసింహవల్లభునిసోదరు నోడించినటుల

గూడ చరిత్రవలన దెలియనగుచున్నది. "మాధవవర్మ" కాలమున నీతడేకాక "పులికేశి" శ్రీహర్షుడు, కూడ యశ్వమేధయాగములం జేసిన మహాపురుషులే ఆకాలమునాటి అనగా 7 శతాబ్దప్రారంభము నాటి హిందూదేశచరిత్రము నాలోచింపగా (1) ఉత్తరహిందూస్థానమునంతయు శ్రీహర్షుడును (2) మహారాష్ట్రకర్నాటకాది దేశములను పులికేశియు. (3) ఆంధ్రోత్కళభాగముల మాధవవర్మయు (4) చోళపాండ్య దేశములను పల్లవులుమాత్రమే పాలించినటులను భరతఖండము 4 రాజ్యములుగానే యుండినటులను దెలియనగును. చాళుక్యులీప్రాగాంధ్రమును జయించినపిమ్మటను విష్ణుకుండినులగు మాధవవర్మసంతతివారు "కాళింగులు"గా మారిరనియు స్వల్పరాజ్యముకలవారనియుం దోచును. కాని క్రీ. శ. 633 నకుబిమ్మటను మాధవవర్మపౌత్రుడో ప్రపౌత్రుడో విజృంభిచి వేగీదేశరాజగు నింద్రభట్టారకు నోడించినటుల దోచును. జయసింహవల్లభుని కాలమున నీయాంధ్రదేశమున కేగుదెంచిన చీనాదేశీయుండగు "హానుత్సాంగు" వర్ణనముంబట్టిచూడ నీప్రాగాంధ్రము జనహీనముగా నుండెను. బౌద్ధహిందూమతములలో బౌద్ధమతము తక్కువస్థితిలోనికి వచ్చుచున్నదని తెలియనగును. రాజులయొక్క యన్యోన్యఘర్షణములవలన జనహైన్యముకు వైదికమతాభిమానులగు విష్ణుకుండిన చాళుక్యాదిరాజుల యాదరణముచే వైదికమతాధిక్యము బౌద్ధమతహైన్యము కల్గియుండెనని మనకు స్పష్టముగాం దెలియనగుచున్నది. ఆకాలమునందు జనులెటుల దేశాంతరగులో చూడుడు. మాధవవర్మ దానమిచ్చునాటికి ప్రతిగ్రహీతయగు "శివశర్మ" కమ్మరాష్ట్రమునందలి "కున్దుక"యను గ్రామవాసియై యుండి గోదావరీమండలములోని "యనపర్తి"యను రైలుస్టేషనుకు 3 మైళ్లదూరముననుండు "పులిబూంరు" (పొలమూరు)ను సం

పాదించియుండెను. రాజ్యవిప్లవముచే నాగ్రామము పరాధీనముకాగా శివశర్మకుమారుఁడు "కుణ్డుక" మను "పులిబూరు"నుగూడ త్యజించి "అసనపురస్థాన" వాస్తవ్యుడై యుండి తిరిగి "పులిబూరు"నే సంపాదించి యుండెను. అయితే యిప్పటిప్రయిటర్లవలె నేపట్టణముననో నివసించి తమజమీనను భవించుచుండి రనగూడదాయనవచ్చును కాని అప్పటిప్రాప్రయిటర్గ్రామములు విశేషధనమునిచ్చునవికాక జీవనాధారమునకుమాత్రమె తగినయుపాధికలవియై యుండెనని నాటియార్థికపద్ధతిని విచారించినఁ దెలియనగును. అందువలననే నాటిమహారాజులు బ్రాహ్మణులకు విశేషాగ్రహారముల నిచ్చుచుండిరికాని నేటివలె విశేషాదాయముఁగలిగిన నిచ్చెదరాయని సందేహింపవలసియున్నది. మఱియు బ్రాహ్మణులాకాలమున మహారాజుతో విద్యలనభ్యసించుచుండిరనియు సాధారణవిద్యనుమాత్రమేకాక వేదమునందే బ్రాహ్మణులు "సబ్రహ్మచారు"లై (ఒకగురువునొద్ద వేదముజదువువారుసబ్రహ్మచారులు) యుండువారనియు శివశర్మ, రుద్రశర్మలు, మాధవవర్మ జయసింహవల్లభమహారాజులకు తైత్తిరీయకవేదమున సబ్రహ్మచారులనుటవలనఁ దెలియనగుచున్నది. మాధవవర్మమహారాజెంతటివైదికాచారపరుడో యాతని యశ్వమేధాదిక్రతువిధానములవలనం దెలియనగును. నాటిబ్రాహ్మణు లెంతటివిద్యావంతులో చూడుఁడు. మొదటిరుద్రశర్మ వేదవేదాంగవేత్త యాతనికొమరుఁడురామశర్మతండ్రికంటె విద్యలలోమిన్న. శివశర్మ వేదచతుష్టయసమామ్నాత. రెండవరుద్రశర్మ వేదద్వయాలంకృతశరీరుఁడు. రెండవరుద్రశర్మకాలమున దేశోపప్లవము సంభవించియుండుటచేతను దేశభ్రష్టుఁడు కావలసివచ్చుటచేతను పోయినయగ్రహారమును సంపాదింపఁ బ్రయత్నించులౌకికవ్యాపారమునం బ్రవేశింపవలసినవాడగుటచేతను రెండువేదములనే చదువవలసినవాఁడుగా గన్పట్టుచున్నాఁడు. అయినను రాజకీయమున ననవసరవ్యవహారములకు బోనివాఁడగుటచేతనే తిరిగి యగ్రహారమునిచ్చునపుడుజయసింహావల్లభుఁడు "స్వకర్మానుష్ఠానపరాయ"యని వ్రాయించియున్నాఁడు. నాటికాలమున నశ్వమేధములు విశేషముగాజరుగుచున్నవికదా.

శ్లో. దీర్ఘకాలబ్రహ్మచర్యం నరమేధాశ్వమేధకా
.........కలౌ నోక్త్యంతు సూరిభిః ...

అశ్వమేధో గవాలంభో సన్న్యాసః పలపైత్యకం ... నదుర్వా ద్భిన్న వర్ణేషు పుత్రిసంగ్రహణంతథా మొదలగువృద్ధ «పారాశరస్మృతి» వాక్యములకును ఈయర్థమునే యిచ్చెడి యాదిత్యపురాణాదివాక్యములకును గతిమేమో పూర్వాచారపరాయణపండితులు సమాధానముఁ జెప్పవలసియుందురు. ఒకయశ్వమేధము నరమేధమే కాదు కలియుగచర్యల నాలోచింపగా నన్నినిషిద్ధకర్మములును కలియుగమున నే జరిగియుండునని చరిత్రముబట్టి కాన్పించును. ఈనిషిద్ధస్మృతులు నేటికి వేయినం॥రములకు పూర్వమున లేనటుల దోఁచును. మాధవవర్మ యశ్వమేధాదిక్రతువులలో సోమపానమును బ్రాహ్మణులతో సమానముగాఁ జేసియుండునుకదా సోమపానమునెటుల జేతురో యజ్ఞాదికములంజూచువారికి దెల్లమగును. ఒకరియెంగిలినొకరు పుచ్చుకొనెదరు. అందువలన 7 వశతాబ్దమున బ్రాహ్మణక్షత్రియులకు సహపంక్తిభోజనముకూడ కలదేమోయని తోఁచుచున్నది. అశ్వమేధానుక్రమణికను రామాయణాదులలోని యశ్వమేధవర్ణనములం జదివిన మహారాజాంతఃపురస్త్రీలకు ఘోషాపద్ధతి లేనటుల స్పష్టమగుచున్నది కాన నాకాలమున ఘోషాపద్ధతియే లేదు. నాటికి వృద్ధపరాశరాదిస్మృతులే పుట్టియుండిన «పరమబ్రహ్మణ్యా»ది బిరుదులుకల మాధవవర్మకాక మహాపండితుఁడగు «శ్రీహర్షుఁడు» «పులికేశి» యనుచక్రవర్తులేల యశ్వమేధములఁజేసిరి. కాన వృద్ధపరాశరస్మృత్యాదు లిటీవల కల్పింపఁబడెనని స్పష్టమగుచున్నది. మాధవవర్మ కేవలవైదికమార్గగామియేకాక «నియమితసర్వగణకకోశా»దిబిరుదుల నొందియుఁడుటచేతను «సకలబలచేతనా»దిబిరుదుల నొందుటచే జయసింహావల్లభమహారాజను రాజకీయపద్ధతులయం దప్రమత్తులై యుండిరనికూడ దెల్లమగుచున్నది. నాటియుద్యోగియులలో «హాస్తికేశ, పీరకేశ»శబ్దములు కాన్పించుచున్నవి. అవి నాటి «కలక్టరు, జడ్జి» పదవులతో సమానమగుపదవులని తలంపవలసియున్నది.

# అమలవర్మ.

## తృతీయాంకము.

ప్రథమరంగము—రాజనగరున నొకగది.

ప్రవేశము—రాజు, రాణి, భానుఁడు, సుశీల, రోచనాక్రాంతుఁడు, క్రీడాస్తరణుఁడు.

రాజు—సుఖముగా నుండవలసినయీదినములలో నాతఁ డిట్లు మతిచెడి పరిభ్రమించుటకుఁ గారణమేమో మీరు కనిపెట్టలేకపోయినారు గదా?

రోచ—మతి కలఁతఁ జెందె నని యాతఁడు నంగీకరించును. కాని కారణ మేమో మాత్ర మెన్నివిధముల నడిగినను దెలుపఁడు.

క్రీడా—అంతే కాదు. తెలియనిచ్చుట కిష్టమయినట్టుకూడఁ గనఁబడఁడు. మే మామాటలు తెచ్చినప్పుడు చల్లఁగా లేనిపోనివెఱ్ఱిమాటలు చెప్పి గడుసుదనముగాఁ దాటవేయును.

రాణి—మిమ్ములను జిన్నగా నాదరించెనా?

రోచ—అయ్యో! అందేమియు లోటు లేదు. చాల పెద్దమనుష్యునివలెఁ బ్రవర్తించినాఁడు.

క్రీడా—కాని యట్లు చేయుట కెంతో శ్రమపడినట్లుమాత్రము తోఁచినది.

రోచ—ఆతఁడు మమ్ముల నంతగా నేమియునడుగలేదు గాని మేమడిగినమాటలకుమాత్రము విచ్చలవిడిగానే సమాధానములు చెప్పినాఁడు.

రాణి.—వాని కేమయిన వినోదములమీఁద మనస్సు కలదేమో కనిపెట్టలేకపోయినారా

రోచ—అమ్మా! త్రోవలో మాకుఁ గొందఱు నాటకులు గనిపించినారు. వారిసంగతి నాయనతోఁ జెప్పినాము. ఆమాటలు చాల సంతోషకరమైనట్లు గోచరించినది. వారాస్థానపరిసరముననే యున్నారు. వారు నేఁటిరేయి యొకరూపక మాడుట కుత్తరమొసంగఁబడి యున్నా రని తలఁచెదను.

భానుఁడు—ఔను. అది నిశ్చయమే దానిం జూచుటకుఁ బ్రభువుల నిరువురిని విచ్చే

యుఁ డని ప్రార్థింపవలసినదిగాఁ గూడ నాతఁడు నన్నుఁ గోరియున్నాఁడు.

రాజు—ఇంతకంటెను గావలసిన దేమి? అతని కట్టియభిలాష యున్నందులకు నాకు మిక్కిలిసంతోష మగుచున్నది. నామిత్రులారా! వాని నింకనుఁ బ్రోత్సహించి యట్టివినోదముల కభిముఖుం జేయుఁడు.

రోచ—చిత్తము దేవా!

( క్రీడా—రోచ— నిష్క్రమింతురు.)

రాజు—దేవీ! మనముకూడ నిచ్చోటు విడిచిపోవుదము. అమలుఁ డిచ్చటికి వచ్చినట్లును ఇచ్చట నాకస్మికముగాఁ గలిసికొన్నట్లు సుశీలను గలిసికొనునట్లును, ఏర్పాటు జరిగియున్నది. ఆమెతండ్రి భానుఁడును నేనును మాటునయుండి వారిచర్యలనుబట్టి మనయమలునిమనోవేదనకుఁ గారణ మామెయందలిమోహ మగునో కాదో స్పష్టముగ నరయువారము.

రాణి—మీయాజ్ఞకు విధేయురాల నగుచున్నాను. అమ్మా! సుశీలా! నీసౌందర్యవిశేష మే యమలుని చిత్తచాంచల్యమునకు హేతువగుఁగాక యని కోరుచున్నాను. నీసుగుణము లాతనిని మరలఁ దిన్ననిత్రోవకు మరల్చునని నానమ్మకము. అది మీయుభయులకును గూడ గౌరవాస్పదము.

సుశీల—అమ్మా! అదియే నాకోరికయును.

భానుఁడు—సుశీలా! ఇటు రమ్ము. దేవా! దేవరకభిమత మయినచో మనము మాటున కరుగుదము. అమ్మాయీ! ఈపుస్తకమును జదువుచున్నట్లు చూచుచుండుము. ఇది నీవిట నొంటరిగా నుండుటకుఁ గారణముగా గనఁబడును.

గీ. ఎట్టిదుశ్చింత తమమది • నెసఁగియున్న
నవగుణంబుల కాకరం • బైనఁ గాని
జనము లద్దాని మతభేష • జంబుచేత
మాటుపచ్చుచు సుజనులై • మసలుచుంద్రు.

రాజు—(జనాంతికము) ఇది నిశ్చయమే.

గీ. నాకు నీపలుకు ములుక్రియై • నాఁటిమదిని
వాదుదుష్కర్మఁ గనుల క • గాదుగోలుప్ర
యెంతమేలుఁగిడినను నార • కాంతవదన
దోష మది సదా దానికి • దోఁచకున్నె.

హా! ఇది యెంతదుఃస్వభావముగా నున్నది.

రాణి—వచ్చుచున్నట్లున్నాఁడు. మనము పోవుదము. రండు దేవా!

(రాజును రాణియును నిష్క్రమింతురు.)

(అమలుఁడు ప్రవేశించును)

అమలు—ఉ. ఉండుటో యీశరీరమున ♦ నుండక దీనిఁ ద్యజించివేయుటో
యుండినఁ గ్రూరదైవవిధి ♦ నుద్భవమొందెడుకష్టవార్ధి ను
ద్దండత నీదిపాటుటయొ ♦ దాని నెదుర్పక యోర్చి యూరకే
యుండుటొ యేది మేలగును ♦ నూహ మనంబుఁ గలంపసాగెడున్.

మృతి యన నెట్టిదో.

గీ. మృతి సుషుప్తికిఁ దుల్యమా ♦ నేను మూఢ
నంతకన్నను వేఱేమి ♦ యగపడ దిఁక
నిద్రచే దేహజనితమౌ ♦ నిఖిలబాధ
లడఁగెనేనియు నదె యంద ♦ ఱగుపదవి

మృతి నిద్రవంటి దగునా?

గీ. అట్లు గాకున్న మృతి స్వప్న ♦ మగునొ యేమొ
యట్టులయినను గొట్టియ ♦ క్రొత్తె యౌను
నశ్వరం బగుదేహబం ♦ ధంబు విడువ
నెట్టి చెడుఁగానొ ♦ యాపెద్దనిద్దురందు.

అందుచేత

గీ. సంశయం బగుదేహంబు ♦ సమయఁ జేయఁ
గాకయుండినఁ బ్రజలకుఁ ♦ గల్గుచుండు
బాధ లీగతి నింతగాఁ ♦ బ్రబలి కాపు
రములు సేయున గడియలో ♦ నమసిపోక.

మఱియు.

సీ. కాలగతిన్ గల్గు ♦ కష్టనిష్ఠురములు
దుష్టులు చేసెడు ♦ దుర్న్యయములు
గర్వాంధు లగువారి ♦ కటుతిరస్కారముల్
వ్యర్థోపయోగమౌ ♦ వలపువంత
శాసనంబులఁ గల్గు ♦ జాప్యంబు మిన్నందు
నధికారమత్తుల ♦ యవగుణంబు

చెడిబ్రతికెడు వారి ♦ చేత సద్వంశ్యుల
కగునట్టిపరిభవం ♦ బాదిగాఁగ

గీ. సన్నియాపదలును నొక్క ♦ యర్ధఘటిక, లోన
జానెడుత్రాటితోఁ ♦ బోనుగాదె
స్మృతికిఁ బిమ్మట నేమియు ♦ గతులు లేక
యుండుటే నిజమైన నీ ♦ యార్తియందు.

మరణానంతర మేదో యున్నదనుభయమును మనమెఱుఁగనిలోకమునకుఁ బోవుదుమనియు నచ్చటికిఁ బోవుటయే గాని మరల వచ్చుట లేదనియు నొక్కడికో పోయి యెఱుఁగనికష్టము లనుభవించుటకంటె యెఱిఁగినవాని నిక్కడనే యనుభవించుట మేలనియు ప్రజలు దలంచుచుందురు గాని లేకున్న నీజన్మమంటు కష్టభారము నెవఁడిట్లు మోయుచుండును? ఇట్టియాలోచనలు కలిగినతోడనే మనకు ధైర్యము నశించిపోవుచున్నది. ఆలోచనమీఁదికి బుద్ధి ప్రసరించినతోడనే యదివఱకున్న నిశ్చయము చల్లగా జాఱిపోవుచుండును. ఇట్లెంతటి యూహలైనను ఆలోచనలోఁ బడినతోడనే కార్యరూపమును బొందనేరక యే సన్నగిలి యంతరించుచున్నవి. శాంతింపుము. మనోహరాంగీ! సుశీలా! నీవు దైవప్రార్థనము చేయునప్పుడు నాపాపములనుగూడ స్మరించి శమింప బ్రార్థింపుము.

సుశీల—ఆర్యా! ఇన్నాళ్లనుండియు మీదర్శనము లేదయ్యె. మీకుఁగుశలమా!

అమలు—ఆ. సంతోషమే. ఆ. సరే. సరే.

సుశీల—మీరు నాకు దయమీఁద నొసంగినజ్ఞాపకచిహ్నము లింకను నాకడ నున్నవి సుఁడీ. మీకవి మరల నిచ్చివేయవలయు ననియెంతో ముచ్చటపడుచున్నాను. సావధానులయి గ్రహింతురుగాక.

అమలు—లేదే. నేను నీకేమియు నిచ్చియుండలేదే.

సుశీల—దేవా! ఇష్టమయినయెడల నవి మీకును జ్ఞప్తికి వచ్చును. మీరు నాకొసంగిన వల్పవస్తువు లయినను వానింబొదివిన మీమృదుమధురనర్మవాక్యమాణిక్యపేటిక వానికి మితిలేనివిలువను గలిగించినది. అట్టిప్రియవాక్యముల మరల నొసంగుట మీకభిమతము కానిచో వానిని మీరే మరల గ్రహింపవచ్చును.

క. దానము ప్రియవాక్యములకు
దానంబై యుండవలయు ♦ దప్పినచో నా

దానము విలువెంతైనను
హీనముగా మానధనుల ♦ కెరదోఁచుఁగదా.

కనుక వీనిని మీరు గైకొనుఁడు.

**అమలు**—సరే. లే. నీవు గుణవంతురాలవే.

**సుశీల**—ఏమి దేవా!

**అమలు**—నీవందకత్తెవే.

**సుశీల**—దేవరయభిప్రాయమేమైయుండునో.

**అమలు**—నీవు గుణవంతురాలవు. సుందరవంతురాలవు నయినయెడల నీకు సౌందర్యముతో సంబంధము కూడదని.

**సుశీల**—ప్రభుకుమారా! సౌందర్యమునకు సద్గుణముతోడి పొత్తుకంటె నుత్తమమెద్ది.

**అమలు**—ఔను. నిజమే.

ఆ. గీ. రూపుచేత గుణము ♦ రూపుమాయుట చాల
సులభమగునుగాని ♦ సుందరాంగి
గుణమునకును రూప ♦ మణఁగియుండియు దాని
కనుగుణముగ నడచు ♦ టరిదికాదె.

ఇది కొంతకాలముక్రిందట విరుద్ధముగానే యుండెనుగాని ఇప్పు డవి నిజమయినవి. ఒకప్పుడు నిన్ను నేను ప్రేమించి యుంటిని.

**సుశీల**—ఔను. దేవా! నేనదియే నిశ్చయమని నమ్మికొంటిని.

**అమలు**—నీవు నమ్మరాదు. సుగుణము లెంతఁగా తెచ్చిపెట్టుకున్నను స్వతస్సిద్ధముగా నున్నదుర్గుణము తలయెత్తక మానదు. నేను నిన్ను ప్రేమించలేదు.

**సుశీల**—అట్లయినచో నేను మరింత మోసపోయితిని.

**అమలు**—ఏసన్యాసులమఠములోనైనఁ బ్రవేశింపుము. పాపాత్ములసంఖ్య నేల వృద్ధి చేసెదవు. నామట్టునకు నేనొకరీతిగా గుణవంతుఁడనే గాని నాయందున్న కొన్నిదోషములను దలఁచుకొనిన నాతల్లిగర్భమున నేను బుట్టకయుండిన బాగుగా నుండునుగదా యని యనుకొనుచుందును. నాకుఁ గావలసినంతగర్వము కొండంతయాశ, గంపెడుకార్పణ్యమును గలవు. చేయవలసిన వనేకదుష్కార్యములు తలఁపునకు వచ్చునుకాని వానిని పన్నుటకుఁ దగినయుపాయము చేయుటకుఁ దగినసమయమును మాత్రము చాలకున్నయది. నావంటిపురుషులీభూమిపై ప్రాఁకులాడుచుండినఁ బ్రయోజన మేమి? మనమందరము పరమదుర్మార్గులము

ఎవని నమ్మకుము. ఏదయిన మతమునకుఁ బొమ్ము. మీతండ్రి యొక్కఁడ నున్నాఁడు.

సుశీల—దేవా యింటనున్నాఁడు.

అమల—పైన తాళము వేయుము. అతని తెలివితక్కువ యింటనే యుండునుకాని యితరత్ర వ్యాపింపదు. నేను పోయెదను.

సుశీల—దైవ మీతనికిఁ దోడుపడుఁగాక.

అమల—నీవు నన్ను పెండ్లియాడినయెడల నీకు నేనిచ్చెదుకట్న మిట్లు పీడించుటయే నీ వెంతనిర్మలవై యుండినను ఎంతసద్గుణములు గలదానవైనను నీకు నిందమాత్రము తప్పదు. ఏదయిన మతమునకుఁ బొమ్ము. పద. నేనుపనివినియెదను, అట్లుగాక పెండ్లి చేసికొనవలసినయెడల నెవరినైన నవివేకిని బెండ్లియాడుము. జ్ఞానులయినపురుషులకు మీరు వారిని రాక్షసులుగాఁ జేయుదు రని మిమ్ముఁ జూచినభయము. శీఘ్రముగా నొకమతముఁ జూచుకొనుము. పద. పద. నేను పోయెదను.

సుశీల—ఓదేవతలారా! వీనిమతి గుదుర్చుఁడు.

అమల—మీమొగము మెరుగులనుగూర్చి కూడ వినియున్నాఁడను. మీరు భగవంతు డిచ్చెడి దొక మొగము. మీరు చేసుకొనున దింకొకటి. మీటక్కులు, మీ టెక్కులు మీనీటులు మీగోటులు నన్నియు నెఱుఁగుదును. దేవుఁ డిచ్చిన వస్తువులకు మాఱుపేరులు పెట్టి యేమయిన ననిన ముద్దరాలితనమును కనఁబఱతురు. ఇంక నాకట్టివి పనికిరావు. దీనితో నాకు మతిపోయినది. ఇంక ముందు పెండ్లిండ్లుండ గూడదని నా తాత్పర్యము. ఇదివరలో వివాహమయిన వారందరిని—ఒకరిని తప్ప. ఉండనిమ్ము తక్కినవా రెట్లున్నవారి నట్లుండనీ. మతమునకుఁ బొమ్ము.

( నిష్క్రమించును. )

సుశీల—ఎట్టిఘనునికి ఇట్టిభ్రష్టత గల్గినది.

గీ. దూరదృష్టికి సచివులు ♦ మీఱువాఁడు
విక్రమంబున యోధుఁడై ♦ వెలయువాఁడు
వాక్చమత్కృతి సుకృతియై ♦ వరలువాఁడు
దేశభూషణమైనట్టి ♦ తేజావాఁడు.

పాఱి కొను.

గీ. లక్షణంబుల కెల్లను ♦ లక్ష్య మితఁడె
రూపవంతుల కద్భుత ♦ రూపు డితఁడె
వర్తనంబున కీతఁడె ♦ ప్రథమగురుఁడు
అట్టి యీతఁడు భ్రష్టయ్యె ♦ నిట్టు లకట.

ఇం॥ నేస్త్రీలలోనికెల్ల నిర్భాగ్యురాలను. తేనెలొలుకువాని తీయనిపదవిన్యాసరచనలయుపమాన మాధుర్యమును గ్రోలినదాననై యిప్పుడు చేతగానివానిచే మీటబడినవీణయొక్క నాదమును బోలినకటువులగు వెగటు మాటలను వినవలసివచ్చినది. అనిరుపమానసుందరయౌవనసుకుమారశరీర మీగతి నుద్రేకమువలనఁ జెడిపోయెనుగదా! ఏమిచూచియుండిన దాని నిప్పుడేమిచూచుచున్నాను. ఎంత దురదృష్టవంతురాలను.

(రాజును భానుఁడును పునఃప్రవేశము.)

రాజు—వానియున్మాదమునకు హేతువు మోహమని చెప్పియుంటివే. ఛీ! వానికా దృష్టియే లేదు. పరికదా వానిమాట లయినను గొంతవఱకు మృగ్యపుతప్పియున్నను మతిభ్రమణమును సూచించుట లేదు. వానిమనస్సున నేదో విచారకారణ మున్నది. దానివలన నెప్పటికయిన నపాయము తటస్థించుట నిశ్చయము. దాని నివారించుటకై యీప్రకారము జరుగవలెను. మనకు రావలసినకప్పమును రాఁబట్టుటకయి యూతఁ డాంగ్లేయదేశమునకుఁ బోవలయును. అదృష్టవశమున నచటిశీతోష్ణాదిభేదమువలనను వస్తుభేదమువలనను వానిమనస్సునందలి కళంకము బోవచ్చును. ఏమందువు.

భాను—అది మేలు కావచ్చును కాని వానిమనోవ్యాధికి మూలము తిరస్కృతానురాగమే యని యింకను నానమ్మకము. ఏమిసుశీలా! నీతోడ నములుఁడు చెప్పినదంతయు మేమే వినినారము. నీవు చెప్పనక్కఱలేదు. దేవా! మీచిత్తము వచ్చినట్లు చేయుడు కాని మీకుచితమని తోచినయెడల నాటకమయినపిమ్మట వానితల్లి వానితో నేకాంతమునఁ బ్రసంగించి దుఃఖకారణ మరయుట మంచిది. ఆమె వానిని మోమోటము లేకుండ నిష్కర్షగ నడుగవలెను. మీ సెలవయినయెడల నేను వారిసంభాషణమును పొంచియుండి వినియెదను. ఆమెకును సాధ్యముకానియెడల నప్పుడు వాని నాంగ్లోదేశమునకుఁ గాని మీచిత్తము వచ్చినమఱియొకచోటికిఁ గాని పంపవచ్చును.

రాజు—అట్లే యగుఁగాక. గొప్పవారికి మతి చెడినప్పు డుపేక్ష సేయరాదు.

## ద్వితీయరంగము.

ప్రవేశము—నగరమున నొక సావిడి.

ప్రవేశము—అమలుఁడు నాటకులు.

**అమలుఁడు**—ఆభాగము నేను జెప్పినప్రకారము ఏకధారగా జదువవలెను. అదిగాక సాధారణనాటకులవలె పాడుచేసినయెడల మీచేఁ బలికించుటకంటెఁ దలారి వారిచేఁ జెప్పించుట మంచిదని యెంచుదును. ఇంతేకాక యీప్రకారముగాఁ జేతులు త్రిప్పుచు రాగముఁ బాడరాదు. అంతయు గాంభీర్యముగాను నుచితముగాను నుండవలెను. ఎట్టి గాఢమయినభావమును వ్యక్తీకరించునప్పుడును జక్కగ నుద్రేకము నడఁచుకొని శాంతులుగాఁ బ్రవర్తింపవలెను. పెద్దవేషము వేసికొని దారుణముగా నఱచుచు వికారముగా నాట్యముచేయువారిని జూచిన క్షుద్రవికారములనేగాని యెఱుగనిపామరులు కడుపుబ్బ నవ్వి సంతోషించినను అట్టిదర్శ్యయనిన నాకుఁ దలకంటగించును. నేనైనయెడల నట్టివారిని గొరడాతోఁ గొట్టుదును. నామాట విని అట్టివికారములనుమాత్రము మానివేయుఁడు.

**మొదటినాటకుఁడు**—అందులకు నాది భారము దేవా!

**అమలు**—బొత్తిగా మందకొడిగా నుండరాదు. ఏది యెట్లుండవలెనో వివేకముతో మీరే యోజించి యేర్పాటుజేసికొనవలెను. పదమును అభినయమును బరస్పరము సంబంధించి యుండవలెను. కాని యెందును మితిమీఱి యుండరాదు. ఆమితి యెప్పుడు దాటునో యప్పుడే రూపకప్రదర్శనమునకుఁ బ్రధానప్రయోజనమయినవిశ్వగుణాదర్శత్వమే విఫలమగును. పుణ్యముయొక్క స్వరూపమిది. క్షుద్రపదార్థములయాకారమిది. ఈకాలముయొక్క స్వరూపస్వభావము లిట్టివి యని స్పష్టముగాఁ దెలియుచుండవలెను. ఇట్లు చేయుటలో మితిమించి నప్పుడును—లోటుచేసినప్పుడును గొన్నివేళల పామరులు సంతోషించినను వివేకసహితులుమాత్రము విచారింపకమానరు. వేలకొలఁదిపామరులు బహూకరించినను ఒక్కపండితుఁడు నిరసించినయెడల నది యంతయు నిష్ఫలమనియెఱుంగవలెను. పామరులను సంతోషపెట్టినవాటకుల ననేకమందిని నేను జూచినప్పు డట్టివారిని భగవంతుఁడేల సృజించెనో యని యాశ్చర్యపడుచుందును.

మొదటి నాటకుఁడు—అట్టి వన్నియుఁ జాలభాగము సంపఠించుకొనినారము దేవా!

అమలు—పూర్తిగా సంపఠించవలెను. తమకుఁ జెప్పఁబడిన దెంతవఱ యంతియే గాని తమస్వంతపైత్యమును గలుపవలదని చెప్పుము. వారిలోఁగొందఱు లేనిపోనివికారచేష్టలు చేసి మూఢులైనశ్రోతలను నవ్వించుటకుఁ దామే నవ్వువార లుందురు. అట్టిసమయములలో నొకప్పుడు ప్రధానమైనభాగము కొంత మఱచిపోవుట తటస్థించును. పద. అన్నియు సిద్ధముచేయుఁడు.

(నాటకులు నిష్క్రమింతురు.)

ప్రవేశము—ఘాణుఁడు, రోచనాక్రాంతుఁడు, క్రీడాస్తరణుఁడు.

ఏమయ్యా! ఈనాటకమును రాజుగారు చిత్తగించెదరా?

ఘాణుఁడు—ఓ! రాణిగారిసహితముగా ఇదె వచ్చుచున్నారు.

అమలు—అట్లయిన నాటకులను త్వరపెట్టుము.

(ఘాణుఁడు నిష్క్రమించును.)

మీరిరువురునుగూడ వారిని వేగిరపెట్టి సహాయపడుదురా?

రోచన-క్రీడా—చిత్తము దేవా!

(రోచన—క్రీడా—నిష్క్రమింతురు)

అమలు—ఓహో! హరేశా! ఏమి?

(హరేశుఁడు ప్రవేశించి)

హరేశు—ఇదె వచ్చితిని దేవా? ఏమిసెలవు.

అమలు—హరేశా! నేనుజూచినవారిలో నెల్ల నీవే నాకు నచ్చినవాఁడవు.

హరేశ—దేవా! అట్లందు వేల?

అమలు—నేను నిన్ను స్తుతియించుచున్నాఁడ నని తలంచకు. నిన్ను స్తుతియించిన నేమిలాభము? నీవేమి ధనికుఁడవనియా నిన్ను బొగడుదును? నీబుద్ధికంటె వేఱుధన మేదియు నీకు లేదయ్యె. పేదవారిని బొగడు టెందులకు? నాలుక తీపుమాటలును వంగివంగిసలాములును ఆటోపముగలవారియెడ వినియోగించిన లాభముండును. విన్నావా? విలువగలిగిన నాయాత్మకుఁ దారతమ్యజ్ఞానము కలదు. ఎవరెట్టివారో తెలిసికొను నేర్పును గలదు. అందుచేతనే నీయందు లగ్నమైనది. నీవెన్ని బాధ లనుభవించుచున్నను నేమియు బాధనొందనివానివలెనే యుందువు. సుఖదుఃఖములకుఁ జలింపక సమానభావముతో నోర్చుకొందువు.

ఆ. వె. భాగ్యవశతఁ దనకుఁ ♦ బ్రాప్తించుసుఖదుఃఖ
ములకు రాగవైర ♦ ములను జెంద
కుచితరీతి వాని ♦ నోర్చి యింద్రియముల
వశముచేసి మసలు ♦ వాఁడె ఘనుఁడు.

ఇంద్రియములకు దాసుఁడుగాని మనుజుని నాకుఁ జూపితివేని వాని నిన్నువలెనే నెత్తిమీఁదఁ బెట్టుకొందును. దీని కేమి—ఇది యప్రస్తుత ప్రశంస. అతి విస్తరము కూడదు. నేఁడు రాజుగారియెదుట నొకనాటక మభినయింపఁబడును. అందొకరంగమున మాతండ్రిగారిమరణమునుగూర్చి నీతోఁ జెప్పియున్న విషయము వచ్చును. అది వచ్చునప్పుడు నీవతిజాగరూకుఁడవై నాపినతండ్రిని వీక్షించుచుండవలెను. అప్పు డాతని నేరము బయలుపడకపోయెనా మనము చూచినది నీచమైనపిశాచమై యుండవలెను. వానినిమాత్రము నీవు దీక్షగాఁ బరీక్షింపవలయు. నేను వానిమీఁదనే కనుగలిగి యుందును. తరువాత మనమిరువురమును సంప్రతించుకొని యిద్దరియభిప్రాయములును సరిపడినది లేనిది చూచుకొందము.

హారేశు—చిత్తము దేవా! వానిని విమర్శించుటలో నే నేమి లోటుచేసినను నన్ను మీ చిత్తమువచ్చినశిక్షకుఁ బాత్రునిగఁ జేయుదురుగాక!

అమలు—వారు వచ్చుచున్నట్టున్నారు. ఏదో యొకచోటు చూచుకొని కూరుచుండుము. నే నేమియు నెఱుఁగనివానివలె నుండవలెను.

(ముందుఘటులు తుపాకి దప్పుదు. ప్రవేశము రాజు-రాణి-సుశీల-రోదనాక్రాంతుఁడు క్రీడాస్తరణుఁడు ఇతరులు.)

రాజు—మాకుమారామలవర్మకు క్షేమమా?

అమలు—కడుసుఖముగా నున్నాఁడు. వాగ్దానమాత్రతృప్తుండై వాయుభక్షకమైన సర్పమువలెనే యున్నాఁడు. మనుష్యులుమాత్ర మట్టియాహారముతోఁ బ్రాణము నిల్పలేరు.

రాజు—ఇది నేనడిగినమాటకు సమాధానముకాదే. అమలవర్మా! ఇవి నామాటలుకావే

అమలు—కావు. ఇవి నావియును గావు. ఇప్పుడు (బాణునితో) అయ్యా మీరు విద్యానిలయమున గొన్నినాళ్లు నాటకము లాడినారుకాదా?

బాణు—ఔను. ఆడినాఁడను. మంచిపాత్రగా నే నన్నెంచెడివారు.

అమలు—మీ రేమివేషము వేసినారు?

భాను—సుజననివేషము వేసినాను. నన్ను ద్రోహుఁడు చంపినాఁడు.

అమలు—అట్టివానిని జంపుట ద్రోహమే. నాటకులు సిద్ధముగానుండిరేమో?

లోచన—సిద్ధముగనున్నారు. దేవా! మీశలవునకై వేచియున్నారు.

రాణి—కుమారా! అమలవర్మా! ఇటువచ్చి నాదగ్గర కూరుచుండుము.

అమలు—తల్లీ! రాను. అంతకంటె నీచోటు నన్నెక్కువగా నాకర్షించుచున్నది.

(అనిసుశీలపాదములపై వ్రాలును)

భాను—(రాజుతో) ఓహో! దయచేసిచూచితిరా!

అమలు—తన్వీ నీయొడిలో శయనింతునా?

సుశీల—వలదు రాజా!

అమలు—నాతలనీయొడిలోఁ బెట్టుకొనియెదనని నాయభిప్రాయము.

సుశీల—సరియే దేవా!

అమలు—మోటుమాటలాడితినని యనుకొంటివా చెలీ?

సుశీల—దేవా! మీరు నేఁడతివిలాసముగా నున్నారే?

అమలు—ఎవరు! నేనా?

సుశీల—మీరే!

అమలు—మనుష్యుఁడు సంతోషముగానుండక చేయునదేమి? చూడు! మాఅమ్మ రెండుగంటలక్రిందట మాయయ్య చనిపోయినను ఎంతయుల్లాసముగా నున్నదో.

సుశీల—లేదు దేవా! మీయయ్యగారు పోయి రెండురెండ్లమాసములైనది.

అమలు—అబ్బా! అంతకాలమైనదేమి? అట్లయిన నేనును విచారచిహ్నములను ధరింపవలెను. అయ్యో! భగవంతుఁడా! రెండుమాసములయిపోయినను నింకను మఱచిపోనేలేదు. అట్లయినయెడల గొప్పవారు చనిపోయినప్పుడు వారిసంగతి యైదారునెలలవఱకును మఱచిపోరుకాఁబోలును. అట్లుండుట కొఱకుఁ డాలయాదులేమైన నిర్మించి పోవలెను. లేకపోయినయెడల మఱవకుండుట కష్టము.

(బొమ్మలాట ప్రారంభమగును)

(ఒకరాజును రాణియు నొండొరులు కౌఁగలించుకొని ప్రవేశించి రాణి రాజునకు వంగివంగి నమస్కరించుచు గాఢానురాగమును జూపును. రాజామెను లేవదీసి తనతల యామెమెడమీఁదఁ బెట్టి యొకపుష్పశయ్యపైఁ బవళించును. అతనికి నిదురపట్టగాఁజూచి యామె వానిని విడిచిపోవును. వెంటనే యింకొకఁడు వచ్చి రాజుకిరీటమునుదీసి ముద్దుపెట్టుకొని రాజుచెవిలో విషముఁబోసి ని

ష్క్రమించును. రాణి మఱలవచ్చి రాజామృతినొందుటనుజూచి విచారమున నభినయించును. రెండుమూడునిముషములలో విషముపోసినవాఁడు మఱలవచ్చి యామెతోఁగూడ విచారించుట నభినయించును. శవమును దీసికొనిపోవుదురు. విషప్రయోగముచేసినవాఁడు రాణిపై తనవలపును దెలిపి కానుకలిచ్చి వేడుకొనును. కొంతసేపామె యనిష్టమునుజూపి చివరకంగీకరించును. అందరునిష్క్రమింతురు )

సుశీల—ఇదియేమిటి దేవా ?

అమలు—ఇదియొకదుర్మార్గము. తడివాతను గొంతుఁగోయుట.

సుశీల—ఇది యాడఁబోయెడు నాటకములోని కథయని తలంచెదను.

(సూత్రధారుఁడు ప్రవేశించును.)

అమలు—ఇదిగో వీఁడు చెప్పగలఁడు. నాటకులకు రహస్యము లేదు. అంతయును జెప్పెదరు.

సుశీల—ఈయభినయమున కర్థమేమో వీఁడు చెప్పునా ?

అమలు—ఇదే కాదు. నీ వేయభినయమునుజూపినను జెప్పగలఁడు.

సుశీల—మీరు కొంటిమాట లాడుచున్నారు. నేను నాటకమును బరిశీలించి చూచెదను.

సూత్రి—మేము ప్రదర్శింపఁబోవు దుఃఖాంతరూపకమును సావధానముగా వీక్షింపఁ బ్రార్థించుచున్నాఁడ. (నిష్క్రమించును.)

అమలు—ఇది నాందియా ? విష్కంభమా ?

సుశీల—ఇది యతిసంగ్రహముగా నున్నది.

అమలు—స్త్రీలవలపువలె నున్నది.

( ప్రభువొకఁడు పట్టమహిషియొకర్తు ప్రవేశింతురు.)

ప్రభువు—గీ. మనల ననురాగలతితోడ ♦ మన్మథుండు
బంధితుల జేసినది యాది ♦ ఖానురథము
భూప్రదక్షిణమొనరిచె ♦ మూడుపదులు
సోముఁడే గెనుజగమును ♦ జుట్టిమూడు
వందలతువది సారులో ♦ యుండువదన.

పట్ట—వారెన్ని వేలప్రదక్షిణములు చేసినను జేయుదురుగాక. మనయనురాగ మక్షీణముగనే యుండును. ఆప్రశంసయేల ? ఈనడుమ నేమికారణముననో మీరు మనస్స్వస్థత లేకయున్నారు. మునుపటి యుల్లాసవిలాసములు చూపట్టవు.

ఇందుచే నాకు విచారమును భయమును గలుగుచున్నవి. దీనిమీఁదేమియుఁ గీడు లేకుండుఁగాక! స్త్రీలభయమునకు ననురాగమునకును మితియుండదు. అవి యుండవలసినంతకంటె నెక్కువగనైన నుండును. తక్కువగనైన నుండును. గాని సరిగ నెన్నఁడు నుండవు. మీయెడ నాకెట్టియనురాగమో మీకనుభవసిద్ధమేగదా! ప్రేమైకస్థానమైనచోట నేమాత్రమును హీనమైన నతిభయావహమగును. అల్పకారణమువలన నధికభయ మెచ్చోటకలుగునో యచ్చోట ప్రేమ విశేషముగానుండును.

పరిభు—ప్రేయసీ! నేను నిన్ను శీఘ్రముగా విడువనైయున్నాను. నాకవయవపాటవము చెడుచున్నది. నీవీచక్కని ప్రపంచమునందు నావంటివానినే మఱల భర్తగా—

పట్ట—చాలుచాలు నిట్టిమాటలు. శాంతింపుఁడు. సిగ్గుచేటు. నాహృదయమునందున్న దట్టితుచ్ఛమైనవలపైయైనయెడల నాయంతటిద్రోహిని లోకమున నుండదు. నేను పునరుద్వాహము చేసికొందునేని యధోగతిపాలై పోవుదునుగాక!

గీ. యముఁడునన్ను నరక ♦ యాతననొందించు
నేనె యట్టిద్రోహి ♦ నైనయెడల
మొదటిమగనిఁజంపు ♦ పుంశ్చలిగాఁగొందు
కాంత రెండవవిభు ♦ గట్టుకొనునె.

అసులు—(అపవారించి) ఇది కంటకమువలె నాటుచున్నది.

పట్ట— క. ధరపై రెండవపెండ్లికి
నరయంగా ధనముమీఁది ♦ యాశయెగాదే
పురికొల్పు దానదాగం
బరవీసంబైనయుండు ♦ టదికల్లగదా.

నేనెన్నఁడు రెండవపతిని జేరిపట్టుదానఁగాను.

పరిభువు—నీకట్టితలంపేయుండవచ్చునుగాని మనము తలఁచుకొనినదానినెల్ల దఱచుగాఁ జేయలేకపోవుచుందుము. చిత్తము మొదట నెంతోదృఢముగానుండినను రానురాను ధృతివీడి స్మృతిననుసరించును. ఆస్మృతి పచ్చిగానున్నంతవఱకు చెట్టునంటిపెట్టుకొనియుండి పక్వమైనతోడనే నేలరాలుఫలమువంటిది. ఒక్కొకయుద్రేకసమయమునఁ దలపెట్టినకార్యముమీఁది పూనిక యాయుద్రేకము సఁగినతోడనే యుడుగును. పెల్లుబొకిన సంతోషవిషాదములచే విషాదములచే

గల్గిన యుద్దేశములు వానితోడనే యదృశ్యములగును. పరిపూర్ణసుఖంబులఢిక బాధలతో బర్యవసించును. ఆసంతోషబాష్పములకు విషాదబాష్పములకు నంతర మంతగాలేదు. నిమిషములో సుఖము దుఃఖమగును. దుఃఖము సుఖమగును. లోకమున నెద్దియు శాశ్వతముకాదు. కాఁబట్టి యీమనప్రేమయు కాలవశమున మార్పుజెందవచ్చును. అవస్థ బలమైనదా? ప్రేమ బలమైనదా? యనునదివివాదాంశము.

గీ. కాలవశత ఘనులకల్ప ♦ గతిఘటింప
విడిచెదరువారిమునుపటి ♦ విహితులెల్ల
నల్పులధనులై ఘనదశ ♦ యబ్బెనేని
శత్రులైన సుమిత్రులై ♦ సంచరింతురి.

గీ. భాగ్యమునుబట్టియు ప్రేమయు ♦ బరగుచుండు
కలిమికాపులుకోదువలే ♦ రిలనుజూడ
ప్రేమతో లేమిమిత్రిత ♦ వేడఁబోవ
నిదిగో నేనంచుశత్రుత్వ ♦ మెదురుపడును.

దీనికేమి మనప్రస్తుతాంశమేమనిన మనసంకల్పములకును దైవసంకల్పములకును సంబంధముండదు. మనసంకల్పములకెప్పుడును వికల్పములే కలుగుచుండును. సంకల్పముమాత్రము మనవశముగాని దానిఫలము మనవశముకాదు. కాఁబట్టి పునర్వివాహమెల్లనని యనుచున్నావేకాని మొదటివిభుడు పోయినతోడనే యాయూహ నశించును.

పట్టు—ఆర్యా! అట్లేలపలికెదరు. నేనింకొకపతిని జేపట్టితినేని యిహపరములకు రెంటికిం జెడి రేయుంబవళ్లు నిద్రియు సుఖము నెట్టిదో యెఱుఁగక నిరాశఁజిక్కి నిరంతరదారుణనరకవాసినినై దుఃఖభాజనమైన యధోగతిపాలగుదును గాక.

అమలు—ఆవాగ్దానమిప్పుడే తప్పిపోయినదో.

ప్రభువు—అబ్బ! అంతయొట్టేలపెట్టుకొనియెదవు? ప్రేయసీ! నన్నిట గొంచెముసేపు విశ్రమింపనిమ్ము. అలసటగానున్నది. కొంచెముసేపు నిద్రతోఁ గాలముపుచ్చెదను.

పట్టు—సుఖనిద్రి ననుభవించెదవుగాక! మనకెన్నఁడు యెడబాటు లేకుండుగాక!

(నిష్క్రమింతురు.)

అమలు—అమ్మా! నీకీనాటకమెట్లున్నది?

రాణి—అపట్టమహిషి యధికప్రసంగము చేయుచున్నదని నాయభిప్రాయము.

అమలు—కాని యామె తనమాటలను నిల్పుకొనునా?

రాజు—కథయంతయు నీవువినియుంటివా? దానియందు దోషమేమియు లేదుకద!

అమలు—లేదు. లేదు. ఇదియంతయు పరిహాసము. పరిహాసమునకె విషముపెట్టును రు. లోకములో దోషమొకటి కలదా?

రాజు—ఈనాటకము పేరేమి?

అమలు—ఎలుకలబోను. ఇది వియానాపట్టనమునజరిగిన హత్యనుగూర్చిన కథ. పట్టమహిషి పేరు బాపిస్థ. తరువాయిచూచెదరుగాక! ఇదియొక దుర్మార్గపు నాటకము. అయిననేమి? నిర్దోషులమైన మీకును నాకును దీనిబాధ లేదు. ఏదైన యదువున్నవా రదరిపడుదురుగాక! మనకేమి?

(లూషియానసుఁడు ప్రవేశించును.)

ఇతఁడు లూషియానసుఁడు. ప్రభువునకు భ్రాతృపుత్త్రుఁడు.

సుశీల—మీరు మంచివ్యాఖ్యాతలు దొరకినారుమాకు.

అమలు—ఇంతేకాదు. నీకును నీసరసునకును జరుగుచున్న సరసమునుజూచితినా మీరేమి చెప్పుకొనుచున్నారో కూడ చెప్పగలను.

సుశీల—మీది కుశాగ్రబుద్ధి దేవా!

అమలు—హంతకుఁడా! ప్రారంభింపుము. నీమొగముత్రిప్పుటలు చాలించి యీపాటి రమ్ము. పాడుచుకొనితినుటకు కాకులు సిద్ధముగానున్నవి.

లూషి—తగినదుర్వృత్తి, తగినచేతులు, తగినమందు, తగినతరుణము నన్నియు సమకూడినవి. కాలముకూడ సరిపడినది. చూచువారెవరును లేరు. అర్ధరాత్రమున సంపాదించిన యోమూలికారాజమా! నీప్రభావ మీసుఖజీవిపై వినియోగించి ప్రాణములను దీసివేయుము.

(అనినిద్రితుని చెవిలో విషముపోయును.)

అమలు—వానిరాజ్యముకొఱకై విషముపోయుచున్నాఁడు. వీనిపేరు గోంజాగుఁడు. ఆకథ జరిగినదే. ఇటాలియనుభాషలో వ్రాయఁబడియున్నది. తరువాత నాహంతకుఁడు వానిభార్యను జేపట్టుటను మనముజూతుము.

సుశీల—రాజు లేచుచున్నాఁడు.

అమలు—ఏమి! ఈకట్టుకథకు భయపడియా?

రాణి—ఏమి దేవర యిట్లయిరి?

భాను—ఈపాటి నాటకము మానివేయుఁడు.

రాజు—నాకొకదివిటీని తెండు. పొండు.

అందరు మషాల్చి! మషాల్చి!

(అమలుఁడు, హారేశుఁడుగాక తక్కినయందరు నిష్క్రమింతురు.)

అమలు—కొందరు సుఖపడుటకుఁ గొందఱు కష్టపడవలెను. అది ప్రపంచస్వభావము. నేనింతికంటె హీనస్థితికి వచ్చిన నాకీనాటకములో నొకభాగ మిత్తువేమో?

హారేశ—సగముభాగమిత్తును.

అమలు—పూర్ణభాగమే యిత్తురని యనుకొనుచున్నాఁడనే. చూచితివా నీవు చెప్పిన మాట వేయివరహాలు చేయునుసుమీ? చూచితివా?

హారేశ—నిశ్చయమే దేవా!

అమలు—విషముమాట వచ్చుసరికి—

హారేశ—నేను బాగుగాగని పెట్టి చూచినాఁడను.

(రోచన-క్రీడా—ఇద్దరును పునఃప్రవేశము.)

క్రీడా—దేవా! నాదొకమనవి కలదు. దానిని వినవేఁడుచున్నాఁడను.

అమలు—ఒక్కమాటయేమి? నీచిత్తమువచ్చినన్ని మాటలు చెప్పుము.

క్రీడా—రాజుగారు.

అమలు—సరే! ఏమి? రాజుగారేమి?

క్రీడా—పూర్తిగా మనస్థిమితముచెడి యేకాంతమందున్నారు.

అమలు—అధికమధుపానముచేతనా?

క్రీడా—కాదు దేవా? కోపముచేత.

అమలు—సరే మీ తెలివితేటలు వినియోగించి తగినవైద్యునివెదకి వానితో నున్నరోగమేమో వివరించిచెప్పి చికిత్సచేయింపుఁడు. నావైద్యమువలన రోగము మఱింతముదురును.

క్రీడా—దేవా! సందర్భముగా మాటలాడుదురా? నేను చెప్పినదొకటి మీరు చెప్పినది వేఱొకటియైనట్లు? ఆగ్రహపడకుఁడు.

అమలు—శాంతముగానే యున్నానోయి చెప్పుము.

పురుషసింహుఁడు రివిన్యూ ఇన్స్పెక్టరుగారిచుట్టును దనయూరివారందఱు నట్లుమూఁగి వినయములై యుండుటఁ జూచి "ఈయ్యనకెక్కడెంతగౌరవము!" అని తనలో నచ్చెరువునొందెను. తానుగూడఁ గరిణీకము చేయవలసివచ్చిన నట్లే యొదిగియుండవలయుఁగదా యని యనుకొనెను.

పురుషసింహుని రాకఁ జూచుచు నతని నంతకుఁబూర్వము కరణముగారికుమారుఁడనియుఁ బ్రవేశపరీక్షకుఁ జదువుచున్నాఁడనియు నింకను జదువనున్నాఁడనియు వినియున్నవారగుటచే ఇన్స్పెక్టరుగారును నాతని సగౌరవముగఁ బిలిచి తండ్రిపోయినందులకు సంతాపము వెల్లడించెను. దానఁ బురుషసింహుఁడును దలవంచుకొని కూరుచుండెను.

అంతట నాయుద్యోగియు "ఇఁకను గాకినాఁడ వెళ్లినవారు కారే? కరిణీకము మీరే చూచు నభిప్రాయము కలదా?" యని యడిగెను. పురుషసింహుఁడును గొంచెము యోచించి ఆవిషయమై తమ మామాలోచనపుచ్చుకొనవలయుననియే వచ్చితినని వినయపూర్వకముగఁ జెప్పెను. ఇంతలో వెంకటస్వామియుఁ జలిదికుడిచి కొంతగోగునారచెంక నిడుకొని చేతుల నులక పేనుచు వచ్చుచుండెను.

"ఇంతమట్టునకు వచ్చినదికాఁబట్టి యీ మేముకూడఁ జదువుటయే యుత్తమము," అని పురుషసింహునితో మాటాడుచు "రావోయి వెంకటస్వామి" యని వచ్చునతనిఁ గూరుచుండుమని "అయిననిప్పుడు చదువులకంటెను నుద్యోగములకంటెను వ్యవసాయమే మెఱుఁగనిపించుచున్నది. మీరంతా చూచితిరా? వేలకువేలు సంపాదించుకొని హాయిమంటూ నులక పేనుకొనుచుఁ గూరుచుండును. మాకో? ఉన్నయిల్లువాకిలి తాకట్టుపెట్టుకొని చదువుకొని పాతికేండ్లుద్యోగము చేసినను వందరూపాయలు కూడఁబెట్టుటకే బ్రహ్మాండము" అని రయితుల దిక్కుమొగంబయి యుండఁగొత్తగా వచ్చిన వెంకటస్వామినుద్దేశించి

కొంచెమునవ్వుచు ననెను.

అందులకు వెంకటస్వామియు “కాని అధికారలక్ష్మి యున్నది కాదండి మఱి తమరుద్యోగములోనున్నారు. కాబట్టి దానివిలువ తమకుఁ దెలియదు. ఏదోచదివి మాఅబ్బాయిగారున్నా, యీపాడుకోటపాడుకరిణీకముగాక యేతహసీల్దారీయో సిరస్తాదారీయో చేయవలయునని మాకోరిక. అప్పుడుకదా మాపన్నులుతగ్గినా మాకు రిమీషనులు వచ్చినా?” అనిహెచ్చరికతోఁ బలికెను.

పురుషసింహుడు నవ్వుచు “మీకెప్పుడు పన్నులూ రిమీషనులూ తగ్గడమే”యని యొకవిధమైన యవ్యక్తహీనభావమున నూరక యనెను.

‘ఇన్స్పెక్టరు’గారును “అలాగునైతే వెంకటస్వామీ! నీకొడుకునకుఁ జదువెందులకుఁ జెప్పించవోయి? అంతడబ్బున్నదికదా” అనియడిగిరి.

“బాబూ! శూద్రులమగుమాకుఁ జదువువచ్చునా? మావాని నింటికడఁగూర్చుండి చిన్నప్పుడు నేనుజదువుకొన్న పాతసుమతీశతకముఁ జదువుకోమన్న ములకాలకర్రతో గొడ్లవెంటబడయాడు. అచ్చరముముక్కైతేమి మఱెందులకైతేమి పెట్టిపుట్టవలెను కదండి” అనివెంకటస్వామి మాఱుపలికెను.

“అన్నీ తుదకంతాయదృష్టమే కాని జరుగుచున్నప్పుడు కొలదిగనో గొప్పగనో చదువుకొనుట యుత్తమము.” అని ‘ఇన్స్పెక్టరు’గారు పురుషసింహునిజూపుచు “ఇతఁడు చదువుకొనవలసినదే కాని యొకచిక్కు కనఁబడుచున్నది. ఇప్పుడు కరిణీకములకు వారసత్వముదీసివైచి, మాన్యములకుఁ బన్నుగట్టి యున్నియుద్యోగములలాగుననే దానినిగూడఁ జేయ “సర్కారు”వా రాలోచించుచున్నారు. అదియుమఖలులోనికి రావచ్చును. అదిరాకుండగా నితఁడు కరిణీకము పని చూచుచున్న

మొదల—ముందువచ్చునదేమిటో యెవరికెరుక—ఉన్నది చెడిపోదు. ఇదినాయభిప్రాయము; అని తెలియఁజెప్పెను.

దానినివిని వెంకటస్వామియు నారయ్యయు మనసఁబునుగూడ నేకగ్రీవముగ నిట్లనిరి. 'అట్లయినఁ జదువుమానివేసి కరిణీకముఁ జేయుటయే మెఱుఁగు ఉన్నది. యూడఁగొట్టుకొని లేనిదానికై కొంతేల మన్ముకోరికలు పెట్టుకొని యుండుట యేమిప్రయోజనము? ఇప్పుడు మాత్రము కొదవేమి? కరిణీకముతోఁబాటు భూములున్నవి. వానినమర్చుకొని కరిణీకముఁజూచుకొనుచుఁ బుట్టినయూరిలోఁ గడుపులోనీరు కదలకుండ నుండవచ్చును. పురుషసింహునిగారియూహ యంతియే;' యని యతనిదిక్కు మొగంబయిరి.

పురుషసింహుఁడును దద్విషయమై యదివఱలోఁ గాకినాడకలక్టరుఆఫీసులో విన్నవాఁడగుటచేఁ దలయూఁచి, తనతల్లితోఁగూడనాలోచించి వలసినయెడఁ ద్వరలోఁ బనిపుచ్చుకొందునని వాక్రుచ్చి 'ఇన్స్పెక్టరు'గారిని దనయింటికి భోజనమునకుఁ బిలిచెను.

'ఇన్స్పెక్టరును ముందుగ్రామమును 'అజమాయిషీ' చేయునిమిత్తము తహసీల్దారు' మధ్యాహ్నమునకు వచ్చుననియుఁ దాను సత్వరము వెడలవలయుననియుఁ దల్లిగారియభిప్రాయమును దీసికొని యిక్కడకు వచ్చినయెడలఁ గరిణీకమొప్పగింత యానాఁడే కాఁగలదనియుఁ జెప్పెను. అందుపైఁ బురుషసింహుఁడు మాఱాడలేక 'చిత్తము' సెలవని యాయన యనుజ్ఞపుచ్చుకొని వెంకటస్వామితో వెడలెను.

ఇంటియొద్దఁ దల్లియుఁ గొడుకును వెంకటస్వామియు నేమియోజించిరో యామధ్యాహ్నమే పురుషసింహుఁడు బయలుదేరి ముందుమకామలోనున్న తహసీల్దారుఁజూచి కరిణీకమొప్పగింత పెట్టుకొని కాగితములుకొన్ని పూర్వపుకరణమునొద్ద తీసికొని తిరిగి రాత్రివడు

సరికింటికివచ్చెను. క్రొత్తగా 'జమాబందీ'యై క్రొత్త 'ఫసలీ' ప్రారంభము కానున్నది. కాఁబట్టి యంతత్వరలోఁ బురుషసింహునకుఁ గరిణీకమొప్పగింతయైనదని పురుషసింహునివేయునపుడు కొందఱు 'సర్క్యూటు' గుమస్తాలు హెచ్చరించిరి.

ఇంటికి వచ్చినతోడనే తల్లి వానిని "అబ్బాయీ! కరిణీకము పుచ్చుకొన్నావా నాయనా? యని తొలుదొల్తనడిగెను.

"పుచ్చుకొన్నానేనమ్మా;, యని కుమారుఁడు బదులాడెను. అంతటనామె మిక్కిలి సంతుష్టాంతరంగురాలై "తండ్రీ! ఇటువంటియవస్థలో మనకదియే సర్వోత్తమమని తోచుచున్నది,, యని యతనికి భోజనముపెట్టి తాను ఫలాహారముఁజేసి యంతకుముందు మధ్యాహ్నమన్నియు మిగిలియుండుటచే నసురసంధ్యవేళనే తినిపడుకొనుటకును గోడలిని నొకమంచముమీఁదఁ బండుకొని కొడుకును గదిలోఁ బక్కపై బండుమని తాను నడవగుమ్మములోఁ గూరుచుండెను. పురుషసింహుఁడు గదిలోఁ గూర్చుండి తాను క్రొత్తగాఁ దీసికొన్న కరిణీకముకాగితములఁ గొన్నింటిని దీపముముందుఁ జూచుచుండెను. అప్పుడు తల్లి కొడుకుతో "అబ్బాయీ! నిన్నుఁ గరిణీకముపుచ్చుకొనుమని బలవంతపెట్టితినని యనుకొనకుము. మనరమణకిప్పుడు పండ్రెండవయేఁడు—రమణయనఁగఁ బురుషసింహునిచెల్లెలు ఆచిన్నదానిపేరు రమణమ్మకాని ముద్దునకు రమణయని వాడుదురు—దానితోడివారప్పుడే కాపురములు దిద్దుకొనుచున్నారు. దానికీయేడైనను బెండ్లిసేయవలయును రా తండ్రిపోయినసంవత్సరములోఁ జేసితివా యాయనయున్నప్పుడు కాకపోయినా కొంతబాగుగనుండును.,, అనుచు సంకుచితకంఠయయ్యె. పురుషసింహుఁడును "ఆలాగునలే." యని తనమనస్సులోఁ దానంతన అతఁ బాఠశాలలోఁ జదువుకొనుటముఖ్యముగు సంతోషకాలక్షేపములఁ

కొఁదనకుఁ జెల్లెనను విచారమున నొకయుత్తరము వసంతసేనునికి వ్రాయ నుద్యుక్తుఁడై యుండఁ దనస్నేహితుని పేరు జ్ఞప్తికి రాఁగానే యొకయాలోచన మనస్సునకుఁ దట్టి తల్లితో "అమ్మా! చెల్లెలికి మంచి మగనిఁ దీసికొనిరావలయును గదా నాతోఁ జదువుకొన్న స్నేహితుఁ డొక్కఁడు కలఁడు. అతనికిప్పు డుత్తరము వ్రాయుచున్నాను. బాగుగ స్మృతికిఁ దెచ్చితిని. అతఁడు మన శాఖవాఁడు. మన గోత్రము నాతనిగోత్రమొకటి కాదు. అతనికి మన రమణను బెండ్లిచేసిన మనకు మంచియల్లుఁడగునని తలంతునే. ఎందుకొకపర్యాయము చూచెదవుగా! సీతాకాలపు సెలవులలో నిక్కడకు రమ్మనెదను." అని మిత్రునికి వ్రాయులేఖలో నొకమాఱు తన్నుజూడ రావలసినదనికూడ వ్రాసెను. తల్లి యుప్పుడు సంబంధమునుగూర్చి యంతయాలోచించినదికాదు కావున మిన్నక శయనించెను.

ఈసంభాషణమున బాలికలిరువురును గుసగుసల ముసిముసినగవుల నిమురించిరి. పురుషసింహుఁడును దాను తహసీల్దారుగారియొద్ద నుండి యాలస్యముగా వచ్చినవాఁడగుటచే వెంకటస్వామి రాకపోయి యుండునని తలంచి యికరాఁడని తలుపువైచి నిదురించెను.

---

## ఏకాదశాధ్యాయము.

---

వసంతసేనుఁడు.

పురుషసింహుఁడు తనమామగారికిఁ జదివి వినిపించిన యుత్తరముఁ జదివినవారికందఱకు వసంతసేనునితోఁ బరిచయముసేయ నభిలాష పుట్టక మానునే? అతఁడు పురుషసింహునికంటె వయస్సునఁ గొన్ని

మాసములుమాత్రమే చిన్న. అయినను వసంతసేనుఁడు పురుషసింహుని కంటె శరీరపుష్టికలవాఁడు. మిక్కిలి యారోగ్యవంతుఁడు. పచ్చనినిమ్మపండువంటి మైచాయకలవాఁడు. మొదటినుండియుఁ దల్లిదండ్రులయు దుపాధ్యాయుల మెలఁగిన వినయవిధేయుఁడు. అతనిజన్మస్థానము రామచంద్రపురముతాలూకాలోని 'పశువులలంక' దూరమునుబట్టి చూచినయెడల నతఁడు ప్రవేశపరీక్షకు రామచంద్రపురములోనే చదువవలసినది కాని యాతనితండ్రి రచ్చవ్యవహారములఁ దిరుగువాఁడగుటచేతను రామచంద్రపురముకోర్టు, ఇప్పుడు కాకినాడలో నుండుటచేతను గుమారునిగూడఁ గాకినాడలోనే ప్రవేశపెట్టెను. వసంతసేనుఁడు స్వగ్రామమున నాంగ్లేయభాషవచ్చిన యొకపంతులుగారియొద్ద మొదటిఫారము వఱకుఁ జదివి తరువాతఁ గాకినాడలోఁ జదువుచు నేఁటఁగృతార్థుఁడగుచు నిప్పుడు ప్రవేశపరీక్ష కర్హుఁడయ్యెను.

సర్వసాధారణముగఁ బల్లెలనుండి పట్టణములకుఁ జదువునిమిత్తమైవచ్చు విద్యార్థులచదువులు తుదకంటఁ గొనసాగుటయరుదు. కొందఱివిద్య వారివారిస్వయంకృతాపరాధమువలననే చెడిపోవుచున్నది. బాలప్రాయపు నవకమెడలని వదనేందుబింబమ్ములతోడను, నమాయికజానపద నవనీతహృదయకమలమ్ములతోడను, పురోభివృద్ధివికాసనిదానులైన యనేకకుమారకులు పట్టణమ్ములకరుదెంచి ''చిఱుచుట్టలు'' చే రొమ్ములను గృశింపఁజేసికొనుచుఁ ''దేమాకునీళ్లఁ'' బుక్కిలించుకొనుచు, వృథాప్రసంగప్రలాపులై, మిథ్యావేషప్రతాపులై, యెందునకుఁగొఱఁగాక యెందఱు చెడుటలేదు? కొందఱు తమకుఁ బట్టనవాన పుసిరు పడమియు, వంటపూటింటనునికి కుదురమియు, బసలుసరిపడమియు, భగ్నారోగ్యవంతులై విద్యకు వెలియగుచున్నారు. మఱికొందఱు విద్యాపేక్షనే ముందువచ్చి జీతములుబత్తెములుభరింపలేక నిరు

పేదతనంబున మఱలిపోవుచున్నారు. ఇఁక కొందఱు పెండ్లికొడుకు చూపుల కీదినముల నాంగ్లేయవిద్య ప్రధానాంగమని కుయుక్తిగ నాలోచించుచుఁ బెంగ్లీయుదాఁక చదువుచు నైదుపోవలుపమనంత వారివారి యూళ్లకు లేచిపోవుచున్నారు. ఇట్లసంఖ్యాకంబులగు కారణంబులచే నెక్కడనో కాని పల్లెటూరిపిల్లవాండ్రచదువులు తుదనెగ్గుట లేదు.

కాని వసంతసేనునిచదు వట్టిది కాదు. ఇతనికిఁ జదువుపై సత్యాసక్తి. దుర్వ్యసనపరుఁడు కాఁడు. ఇతనిలో నొకవిధముగఁ బల్లెటూరివాండ్రమంచిగుణములును బట్టణవాస్తవ్యులమంచిగుణంబులును బొందుపఱుపఁబడియున్నవి. ఇతనితండ్రియుఁ బట్టణంబుల వాసికెక్కినయుద్యోగస్థులతోడను న్యాయవాదులతోడను బరిచయము చేసియుంటఁ జదువుకొనినఁదనతనయుఁడు కూడ నంతవాఁడు కాకపోవునాయని మిక్కిలియుత్సాహముతోఁ జివరవఱకుఁ జెప్పించుతలంపుతో నున్నవాఁడు కాని మఱియొకటి కాదు. వసంతసేనునితండ్రికి మంచిభూవసతి కలదు. అదిసొంతముగ సాగుచేయుచుండును. చుట్టుపట్ల మంచిపలుకుబడి కలవాఁడు.

వసంతసేనునకుఁ బురుషసింహునకుఁగల పరస్పరమైత్రికి ముఖ్యకారణము వారిరువురును జనపదజన్మవాసన కలవారగుటయే. రెండవది కొంచెమించుమించుగ సవయస్కులు. సామాన్యముగఁ బాఠశాలవిడిచినతర్వాత సాయంకాలములయందుఁ గడుదవ్వు విహారములకరుగుచు నొండొరులు తమతమగ్రామములయందలి సృష్టిసౌందర్యవైభవంబులఁగూర్చియు, జనులనైసర్గికంబులఁగూర్చియు, లోటుపాటులనుగూర్చియు ముచ్చటించుకొనుచుఁ జర్చించుచుందురు. అందునొకరియూరొకరు సందర్శింప నభిలషించుచుందురు. అభిప్రాయభేద మంతగ లేనివారు. అయిన వారిరువురకొక్కచో వ్యత్యాసము కలదు. పురు

షసింహునకు వివాహమైనది. వసంతసేనునకుఁ గాలేదు.

వసంతసేనునిహృదయమున నొకానొకప్పుడు ప్రబంధవికారసంభరితంబగుచుండు. అతఁడు కేవలము పరీక్షకై యేకాక జ్ఞానమునకై కూడఁ బెక్కితరపుస్తకములను జదువుచుండును. ఒక్కయాంగ్లేయభాషనే కాక సంస్కృతాంధ్రంబులన్నఁగూడ నతనికభిమానము మెండు. పుట్టుబాసలఁ గౌరవింపనివాఁడు పుట్టనేటికను. మనదౌర్భాగ్యవశంబునఁ జనువుగొనుటకుఁ బూర్తియైన యవకాశము లేకపోవుచున్నదికాని గీర్వాణముకంటె భాషాశిరోభూషాయమానముకలదే యని చక్కని కాళిదాసుశాకుంతలంబునందలి యెక్కుడురసవంతములగు శ్లోకంబుల నెవ్వరైనఁ గడనున్నవారికిఁ జదివి వినిపించును. ఎవ్వరునులేకున్నఁ దాఁ దనలోఁ బఠించుకొనును. ఒకొక్కప్పుడు నన్నయకృత, తిక్కనకృత, పోతనకృత, పెద్దనకృత మహాగ్రంథంబులందలి గద్యపద్యముల నెంతయోహృద్యంబుగఁ జదువు. అట్లని యాంగ్లేయభాషను నిరసింపడు. ప్రవేశపరీక్షావిద్యార్థియయ్యును "షేక్స్పియరు" "వర్డ్సువర్తు" "కీట్సు" "షెల్లీ" మున్నగువారిపొత్తంబులనుండి సమయస్ఫూర్తిగఁ బంక్తులవల్లించును. అతని నెద్దియైన నొకానొకవిషయమై వ్యాసముఁ బురికొల్పిన నిచ్చవచ్చినట్లు స్వకల్పితభావంబులఁ బుంఖానుపుంఖంబుగ వెలిఁబుచ్చుచుఁ గొంకులేక వ్యక్తీకరించును. ఆవిధంబుగఁ బెద్దవాఁడైన మహాపురుషుఁడు కాఁగలఁడని యతని ననుకొననగు. కాని ప్రస్తుతాంశమునకు నతఁడొక కుఱ్ఱవాఁడు.

అతనికి వివాహమునుగూర్చి—నవవికాసమనుఁడు లేక క్రొత్తవికారమనుఁడు—ఒకవింతయభిప్రాయము కలదు. అదొక్కటనే పురుషసింహునికి నతనికి మతభేదము. అదియే పురుషసింహుని కసంభవము.

# WANTED.

Agents to "**Andhraseva**" a Telugu Educational Monthly Journal. Leberal commission paid.

Apply with a half-anna postage stamp to:—

The Editor "ANDHRASEVA"

PITHAPURAM,

*Godavari Dt.*

# Wanted.

Every businessman to have his advertisement made in this Journal. For particulars, apply with half-anna postage stamp to:—

The Editor "**Andhraseva**"

Pithapuram, *Godavari Dt.*

ఆర్. సిహెచ్. హైస్కూలు ప్రధానోపాధ్యాయులగు మ.రా.రా.శ్రీ కూచి నరసింహముపంతులు బి. ఏ. గారిచే రచింపఁబడిన యీక్రింది గ్రంథములు మాకార్యాలయమున దొరకును. పోస్టేజి కొనువారే భరించవలెను.—

1. శ్రీరామకృష్ణపరమహంసచరిత్రయు దద్బోధములును.

   పేజీలు 170, 2 వ కూర్పు. వెల రు 0-10-0

2. శ్రీగౌరాంగ (చైతన్యస్వామి) చరిత్రము.

   1 వ భాగము పుటలు 373. ,, 1-4-0

   2 వ భాగము పుటలు 397. ,, 1-4-0

3. రూపలత. నాటకము (క్రొత్తకథ) పుటలు 150. ,, 0-14-0

వలయువారు, "ఆంధ్రసేవాపత్రికాధిపతిగారు,

పిఠాపురము, గోదావరిజిల్లా"

అని వ్రాయవలెను.